RNI NO:TELTEL/2017/74161

www.janavijayam.com

# జన విజయం
# JANA VIJAYAM

మీరు జర్నలిస్టుగా పని చేస్తారా?

రెండు తెలుగు రాష్ట్రాల నుండి జనవిజయం వారపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్, నియోజకవర్గం ఇన్‌చార్జ్, మండల రిపోర్టర్‌లు కావలెను.

సంఘటనను వార్తగా మలచే తెలుగు భాషా ప్రావీణ్యం ఉంటే చాలు.

18సం. పైన వయసు కలిగియుండి జర్నలిజం పట్ల ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

మీ వివరాలను పంపించాల్సిన చిరునామా:

వాట్సాప్ నెంబర్ : 9866925937

మెయిల్ ఐ.డి : janavijayam@gmail.com

ఖమ్మం సంపుటి : 8 సంచిక : 27 06-12 ఏప్రిల్, 2025 ఎడిటర్ : పల్లా కొండల రావు పేజీలు : 8 వెల : రూ. 15.00

KHAMMAM Volume : 8 Issue : 27 06-12 April, 2025 Editor : Palla Kondala Rao Pages : 8 Price : Rs.15.00

# మనిషిని చంపేస్తున్న లాభాపేక్ష

- ❖ విచ్చలవిడిగా పురుగుమందుల వాడకం
- ❖ పంటల్లోంచి ఒంట్లోకి చేరుతున్న రసాయనాలు
- ❖ లాభమంతా జబ్బులకే ఖర్చు చేయాల్సిన దుస్థితి
- ❖ ప్రజారోగ్యంపై చర్చ జరగాలంటున్న మేధావులు
- ❖ హైబ్రిడ్‌ను వదిలి నాటు విత్తనాలను కాపాడుకోవాలి



(హెల్త్ డెస్క్, జనవిజయం)

మనిషి ఇప్పటికైనా మేల్కొనకపోతే మానవ మనుగడే కష్టం అన్నట్లుగా తయారైంది. లాభాలకోసం చేసే సాగు చివరికి మనిషినే మింగేస్తోంది. అవసరానికి మించి పురుగుమందులు వాడడంలో పంజాబ్ తరువాతి స్థానంలో రెండు తెలుగు రాష్ట్రాలుండడం దారుణం. సేంద్రీయ ఎరువులతో చేసే సాగుకు, పురుగుమందులతో చేసేసాగుకు ఉన్న తేడా ఏమిటి అన్నది విస్తృతస్థాయిలో చర్చ జరగాల్సిన సమయం ఆసన్నమైంది. నాటు విత్తనాల సాగుకు, హైబ్రిడ్ వంగడాల సాగుకు ఉన్న తేడాను కూడా గమనంలోకి తీసుకోవాల్సిన అవసరం వచ్చింది. ఇపుడు జరుగుతున్న పద్ధతులలోనే సాగు కొనసాగితే ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల విషయంలో తక్షణమే మేలుకోకపోతే ప్రజారోగ్యం దారుణంగా దెబ్బతినడం అనివార్యంగా మారింది. ఇప్పటికే కొత్త కొత్త జబ్బులు వయసుతో, అలవాట్లతో నిమిత్తం లేకుండా వచ్చేస్తున్నాయి. కేన్సర్ మహమ్మారిలా విజృంభిస్తోంది. ప్రజారోగ్యంపై విస్తృతంగా చర్చ జరగాలని మేధావులు, నిపుణులు వాపోతున్నారు. సోషల్ మీడియా వేదికగా పురుగుమందుల వాడకంపై, వాటివల్ల జరిగే అనర్థాలపై ప్రచారం జరుగుతోంది. అయితే ఇది సరిపోదని ప్రభుత్వం, రైతు సంఘాలు, పౌర సమాజం, పర్యావరణ ప్రేమికులు.... ఒక్కరేమిటి ఆరోగ్యవంతమైన సమాజాన్ని కోరుకునేవారంతా ప్రస్తుతం జరుగుతున్న అనర్థంపై నోరు విప్పాల్సిందే.

పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి రావాలంటే నేలకు సూక్ష్మ, స్థూల పోషకాలు అవసరం. గతంలో సేంద్రియ ఎరువుల ద్వారా అవి సమపాళ్లలో అందేవి. హరిత విప్లవం అనంతరం అధిక దిగుబడినిచ్చే వంగడాలకు తోడు, సాగులో రసాయన ఎరువులూ క్రిమిసంహారాల వాడకం పెరిగింది. దానివల్ల ఆహారోత్పత్తిలో ఇండియా స్వావలంబన సాధించింది కానీ, కాలక్రమంలో రసాయనాల ఉద్ధృతి మరీ కట్టుతప్పింది. ఫలితంగా సేద్యం సంక్షోభంలోకి జారిపోతుంటే, ప్రజారోగ్యం జబ్బుల పాలవుతోంది. ఇంతటి ప్రమాదకర రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్న దేశాల్లో ఇండియా కూడా ఒకటి. 2023-24లో దేశవ్యాప్తంగా 64.84 మిలియన్ మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులను పొలాల్లో గుమ్మరించారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 1.6శాతం ఎక్కువ. జాతీయ సగటుకు రెట్టింపు స్థాయిలో ఏపీలో రసాయన ఎరువులను వాడుతుండటం, కొన్ని జిల్లాల్లో అది నాలుగు నుంచి ఆరు రెట్లకు పైబడటం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలోనూ ఇదే దుస్థితి నెలకొన్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే సాగుభూములు నిస్సారమై దేశ ఆహార భద్రత, ప్రజాసంక్షేమం పెను ప్రమాదంలో పడతాయి. అధిక ఫలసాయాన్ని ఆశిస్తూ సాగుదారులు తమ పొలాల్లో రసాయన ఎరువులను విపరీతంగా వెదజల్లుతున్నారు. దాంతో చేలకు చీడపీడల బెడద ఎక్కువై పెట్టుబడి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. సేంద్రియ కర్బనం దెబ్బతిని పంటభూములు సారహీనమవుతున్నాయి. మరోవైపు పంటల ద్వారా మానవ దేహంలోకి చేరుతున్న రసాయన అవశేషాలు- క్యాన్సర్లు, ఇతర అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. దేశీయంగా నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం (ఎన్‌పీకే) వినియోగ నిష్పత్తి 4:2:1కు మించకూడదు. నిరుడు ఖరీఫ్‌లో అది 9.8:3 గా నమోదైంది. గుంటూరు, తిరుపతి, బాపట్ల వంటి జిల్లాల్లో ఆ మోతాదు మరింతగా దాటిపోయింది. పంజాబ్ తరవాత ఏపీ, తెలంగాణల్లోనే పొలాల్లో రసాయన ఎరువుల గుమ్మరింత ఎక్కువగా ఉందని, దాన్ని తగ్గించాలని కేంద్రం సూచించింది. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడం దురదృష్టకరం. భూసార పరీక్షలను పట్టించుకోకుండా చాలాచోట్ల అవసరం లేకపోయినా యూరియా తదితరాలను చల్లేస్తున్నారు. దానివల్ల నేల సారం కోల్పోయి ఉత్పాదకత పడిపోతోంది. ఇన్ని అనర్థాలకు కారణవ-ువుతున్న రసాయన ఎరువుల వాడకాన్ని నిరుత్సాహపరిచి తీరాలి! సాగు పద్ధతుల్లో వచ్చిన మార్పులతో గత యాభై ఏళ్లలో దేశీయంగా వరి, గోధుమల్లో ఐరన్, జింక్ వంటి పోషక విలువలు తరిగిపోయాయి. వరిలో ప్రమాదకర ఆర్సెనిక్ అధిక మొత్తంలో పేరుకుపోతోంది. జీవనశైలి మార్పులతో ఇప్పటికే రకరకాల వ్యాధులు విజృంభిస్తున్నాయి. వాటికి తోడు పంటల్లో సారం తగ్గిపోతే జనభారతానికి నిస్సత్తువ ఆవహిస్తుంది. ఆ దయనీయావస్థ దాపురించకూడదనే సేంద్రియ సాగును కేంద్రం ప్రోత్సహిస్తోంది. రైతులను ప్రకృతి సేద్యం బాట పట్టించేందుకు రాబోయే రెండేళ్లలో రూ.2,481 కోట్లు ఖర్చు చేయాలని నిశ్చయించింది. 7.5 లక్షల హెక్టార్లలో ఈ తరహా సాగును చేపట్టి, కోటి మంది అన్నదాతలకు దాన్ని చేరువ చేయాలన్నది సర్కారీ ఆశయం. అది నెరవేరాలంటే, స్థానిక పరిస్థితులకు తగిన వ్యవసాయ విధానాలకు పెద్దపీట వేయాలి. సేంద్రియ సాగుకు రాష్ట్రాలూ వెన్నుదన్నుగా నిలవాలి. ఇబ్బడిముబ్బడిగా రసాయన ఎరువుల వాడకం మూలంగా తలెత్తే ఉపద్రవాలపై సాగుదారులకు అవగాహన కల్పించాలి. భూసార పరీక్షల ఫలితాల ప్రకారమే ఎరువులను వాడేవిధంగా చైతన్యం పెంచాలి. అప్పుడే రైతుకు లాభం, దేశానికి క్షేమం.

ప్రజల ఆలోచనలలోనూ, జీవన శైలిలోనూ ఇపుడిపుడే మార్పులదిశగా ఆలోచనలు, ఆచరణలు ప్రారంభమైనాయి. ఇది కేవలం ఆరంభం మాత్రమే. మళ్లీ పాతకాలపు సాగు పద్ధతులను ఆధునిక టెక్నాలజీని మేళవించి వ్యవసాయం లాభం కోసం వికృతపోకడలవైపు మళ్లకుండా మనిషి మనుగడకోసం మంచి ఆరోగ్యం కోసం అవసరమైన పోషకాలను అందించే ఆహార ఉత్పత్తులను అందించే దిశగా మారేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలి. భవిష్యత్ తరాలు నిస్సత్తువగా, పేలవంగా జీవించేవారిగా కాకుండా పటిష్టమైన, తేజోవంతమైనవారిగా ఉండేలా సాగు ఉత్పత్తులు ఉండేలా నియంత్రణా చర్యలుండాలి. వ్యవసాయం పండుగలా మారడమంటే కేవలం రైతులకు లాభాలు రావడం మాత్రమే గాక సమాజానికి అవసరమైన పంట ఉత్పత్తులు అందించేలా, మరోవైపు రైతుకు గిట్టుబాటు ధరకు ఢోకా లేకుండా ప్రభుత్వ పథకాలు రూపొందాల్సిన తక్షణ సమయమిది.




# పవన్‌పై రగిలిపోతున్న కాపులు

**నీలు దొరికితే చాలు బాబును మోసేస్తున్న పవన్!**
**కమ్మ, రెడ్లకే ఊడిగం చేయాల్నా అంటున్న కాపులు?**
**చిరంజీవి, పవన్ లు తమ అసమర్ధతను చాటుకుంటున్నారా?**
**పవన్ కళ్యాణ్ ప్రవర్తనపై నిరుత్సాహంగా ఉన్న క్యాడర్**

(పొలిటికల్ డెస్క్, జనవిజయం)

పవన్ కళ్యాణ్ ఎపుడూ పరాన్నజీవిగానే ఉంటారా? ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కాపునేతను చూడాలన్న తమ సామాజికవర్గం ఆశలు నెరవేరవా? అని కాపులు నైరాశ్యంలో పడిపోతున్నారని తెలుస్తోంది. చిరంజీవి మాదిరిగానే పవన్‌కళ్యాణ్ కూడా వ్యవహరిస్తున్నారని జనసేన నేతలు, పవన్ అభిమానులు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ కాపునేతలు వాపోతున్నారు. రాష్ట్రంలో కాపుల సంఖ్య గణనీయంగా ఉంది. కొన్ని జిల్లాల రాజకీయాలను వారు శాసిస్తున్నారు కూడా. అయితే తమ సామాజిక వర్గానికి కీలక పదవులు రావడంలేదన్న బాధతో వారు రగిలిపోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. బలమైన ఫాన్ బేస్ కలిగి ఉన్న పవన్ కళ్యాణ్‌కు కేంద్రంలోని మోడీ సర్కార్ అండదండలు కూడా పుష్కలంగా ఉన్నాయి. గత ఎన్నికలలో పవన్ కారణంగానే తెలుగుదేశం అధికారంలోకి వచ్చిందని కాపునేతలు బలంగా నమ్ముతున్నారు. పవన్ తనను తాను తగ్గించుకుని మరీ జగన్‌ను ఓడించారనీ అంతిమంగా ఇది చంద్రబాబుకు లాభించిందనేది వారి వాదన. పవన్ మాత్రం తనకు చంద్రబాబు, చంద్రబాబుకు తాను ప్లస్ అయినట్లుగానే భావిస్తున్నారు. ఆయన వ్యాఖ్యలే దీనిని ప్రతిబింబిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు కాపు సామాజికవర్గానికి ఇబ్బందికరంగా మారిందనేది సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని బట్టి తెలుస్తోంది. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలు తననే కాకుండా కాపు సమాజికవర్గాన్ని కించపర్చే విధంగా ఉన్నాయన్న ఆవేదన వారిలో కనపడుతుంది. ఇటీవల అమరావతిలో జరిగన పీ4 పథకం ప్రారంభం కార్యక్రమంలో కూడా పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ట్యాగ్ చేస్తూ కొందరు సోషల్ మీడియాలో పోస్టింగ్ లు పెడుతున్నారు. మన వద్ద సత్తా లేనప్పుడు సత్తా, ప్రతిభ, బలం , సమర్థత, తెలివితేటలు ఉండే నాయకుడికి మద్దతివ్వాలని తాను అనుకున్నట్లు ఆయన చంద్రబాబును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. చంద్రబాబుకు మద్దతు ఇస్తే ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని చేసిన వ్యాఖ్యలు తమకు ఇబ్బందికరంగా మారాయంటున్నారు. కాపులు ముఖ్యమంత్రి కావాలని గత కొంతకాలంగా కోరుకుంటున్నా అది సాధ్యం కావడం లేదు. టీడీపీ అధికారంలోకి వస్తే కమ్మ, వైసీపీ అధికారంలోకి వస్తే రెడ్డి సామాజికవర్గం తప్ప కాపులుకు అవకాశం ఉండదు. అలాంటి సమయంలో జనసేన పార్టీని తమ సొంత పార్టీగా భావించామని, అధికారం దిశగా అడుగులు వేయాలి తప్పించి, ఒకరి చేయి కింద నీళ్లు తాగడమేంటని కొందరు నేరుగా సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. సత్తా లేదని ఒప్పుకోవడమంటే రాజకీయంగా విఫలమయినట్లేగా? అని మరికొందరు నేరుగానే నిలదీస్తున్నారు 2008లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు కూడా కాపు సామాజివర్గం ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. అయితే అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కావడంతో పెద్దగా ప్రజారాజ్యానికి జనం నుంచి ఆమోదం లభించలేదు. చిరంజీవి చరిష్మా కూడా నాడు సరిపోకపోవడంతో కేవలం పద్దెనిమిది సీట్లకే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో తర్వాత ప్రజారాజ్యాన్ని కాంగ్రెస్ లో చిరంజీవి విలీనం చేయడాన్ని కూడా కొందరు తప్పుపట్టారు. ఇప్పుడు తమ్ముడు కూడా తెలుగుదేశంతో జత కలసి తన పార్టీని తానే కించపర్చుకునే విధంగా మాట్లాడటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సత్తా లేదని చెప్పడం అంటే ఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలు, అభిమానులను కించపర్చడమే కదా? అని వారు అంటున్నారు. పవన్ కల్యాణ్ కేవలం చంద్రబాబును పొగడ్తలకే వ రి వి ు త వ ు ం ు ు న ట్ల కనిపిస్తుందని, కనీసం హామీలు అమలు చేయాలని నిలదీసే శక్తిని కూడా కోల్పోయిన పవన్ కల్యాణ్ తన బలహీనతను ఇలా బయటపెట్టుకుంటున్నారన్న విమర్శలు నెట్టింట జోరుగా వినిపిస్తున్నాయి. మిత్రపక్షంగా ఒకసారి ప్రశంసలు కురిపించడం వేరు. కానీ వీలు చిక్కినప్పుడల్లా పొగడ్తలతో ముంచెత్తడమంటే పార్టీ క్యాడర్‌ను నిరాశలోకి నెట్టడమేనని, అలాగే వెన్నుదన్నుగా నిలిచిన కాపు సామాజికవర్గాన్ని కూడా కించపర్చినట్లేనన్న అభిప్రాయం సోషల్ మీడియాలో వ్యక్తమవుతుంది. సత్తా లేకపోతే.. ఎందుకు పార్టీ పెట్టాలి? ఎందుకు పోటీ చేయాలి? అని కొందరు ఆగ్రహంతో ప్రశ్నిస్తున్నారు. పవన్ సద్దుద్దేశ్యంతో చేసిన వ్యాఖ్యలు వేరే సంకేతాలు వెళుతున్నట్లు కనిపిస్తుంది.



6-12 april, 2025_Layout 1 4/22/2025 7:49 PM Page 2



## సంపాదకీయం



పల్లా కొండలరావు
(ఎడిటర్)

# ధర్మో రక్షతి రక్షిత:

"ధర్మాన్ని రక్షించండి. అది మిమ్ములను రక్షిస్తుంది." ఇది సత్యం. ఏది ధర్మం? ఏది అధర్మం? అనేది ప్రశ్న. ఎవరు దేనిని ధర్మంగా నమ్ముతారో ఆ నమ్మకాలను బట్టి ధర్మం ఉండదు. ధర్మం ఎపుడైనా, ఎక్కడైనా ఒక్కటే ఉంటుంది. ధర్మాన్ని రక్షించాలనుకుంటే ముందుగా ధర్మాన్ని తెలుసుకోవాలి. దానిని అనుసరించాలి. కాపాడాలి. అపుడు ధర్మం కాపాడబడుతుంది. ధర్మం కాపాడబడినపుడు సమాజం కాపాడబడుతుంది. ధర్మాన్ని తెలుసుకోవడం ఎలా? ధర్మమంటే మతగురువులు, ప్రవక్తలు, దైవదత్తమని చెప్పబడే గ్రంధాలలో చెప్పబడిన అంశాలు కాదు. ధర్మం మనుషులు తయారుచేసింది కాదు. మనుషులు ధర్మాన్ని తెలుసుకోగలగడం మాత్రమే చేయగలరు. దైవాన్ని, దైవదత్తాలను, మతాన్ని, మత గ్రంధాలను భయంతోనో, భక్తితోనో సృష్టించినవాడు మనిషి. మనిషి సృష్టించిన ఈ ధర్మాలలో ఉండేదంతా ధర్మబద్ధం కాదని చాలాసార్లు ఋజువైంది. భూమి బల్లపరుపుగా ఉందా? భూమి చుట్టూ సూర్యచంద్రులు తిరుగుతారా? లాంటి అనేక ధర్మాలు ధర్మం కాదని తేలాయి. ధర్మమంటే మతసంబంధమైన పదం కాదు. ధర్మాన్ని మతపరమైన పదంగా మతవాదులకు దాదాపుగా అంకితం చేయడం అధర్మం. ధర్మాన్ని ఇంతటి అధర్మంపాలు చేయడం ఎంతవరకు ధర్మం? కనుక ధర్మమును రక్షించాలనుకునేవారు తప్పక ధర్మాన్ని గురించి తెలుసుకోవాలి. ధర్మం పేరుతో కొనసాగుతున్న నానా అధర్మాలను అరికట్టాలి. ధర్మంను గురించి ఆలోచించేది మనిషి మాత్రమే. ఎందుకంటే మనిషి మాత్రమే ఆలోచించగలడు. 84లక్షల జీవరాసులలో మిగతా జీవరాసులన్నీ అనాదిగా తమలో ఏ మార్పూ లేకుండా తమ ధర్మాన్ని తాము పాటిస్తూ వస్తున్నాయి. వాటి ధర్మాన్ని తు.చ తప్పకుండా పాటిస్తూ వస్తున్నందున, వాటి ధర్మాన్ని అవి కాపాడుకుంటూ వస్తున్నందున ధర్మాన్ని అవి నాశనం చేయనందున ధర్మాన్ని గురించిన స్థితప్రజ్ఞత వాటికి ఉన్నట్లేనని చెప్పకతప్పదు. కాబట్టి ధర్మాన్ని అవి రక్షించాల్సిన బాధ్యతను చేపట్టాల్సిన అవసరం లేదు. ఆ బాధ్యత వాటిది కాదు. జీవరాసులలో ఆలోచించగలిగేది, మారగలిగేది కేవలం మనిషే కనుక ధర్మాన్ని అనుసరించడం లేదా అతిక్రమించడం చేయగలిగేది కూడా మనిషే. ధర్మాన్ని అతిక్రమించేది మనిషే అయితే దాని ఫలితాల్ని అనుభవించేది కూడా మనిషే కనుక ధర్మాన్ని కాపాడుకోవలసిన బాధ్యత కూడా మనిషిదే. అంటే జీవరాసులలో ధర్మాన్ని గురించి ఆలోచించేది, అతిక్రమించేది, కాపాడుకోవలసింది మనిషేనని చెప్పాలి. ఇందులో మనుషులంతా ఒకేరకంగా లేరు. మనుషులలో కృత్రిమ ధర్మాలను సృష్టించేది మనిషే. ధర్మం పేరుతో అధర్మంగా, అకృత్యాలను చేసేది మనిషే. వాటిని అడ్డుకునేది మనిషే. అధర్మాన్ని అంతమొందించి ధర్మాన్ని కాపాడాల్సినది మనిషే. కనుక ధర్మం గురించి అధ్యయనం చేయాల్సింది మనిషే. ధర్మం గురించి ఎంత ఎక్కువ మంది సరిగా అవగాహన చేసుకుంటే, ఇతరులకు ఆ ధర్మాన్ని బోధిస్తే మెరుగైన, మేలైన సమాజం ఏర్పడడానికి అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయి. మనిషి ఆలోచనలో సాటిమనుషులకు అవసరమైన విషయాలను ఆలోచించగలిగే బుద్ధిని కలిగి ఉండడం ధర్మం. అందరూ బాగుండాలి, అందులో నేనుండాలి, అందుకోసం నా పని నేను చేయాలి అనే ప్రవర్తన, ఆచరణ కలిగి ఉండడం ధర్మం. మనుషులందరూ ఇలా ఎందుకుండడం లేదో, అందుకు చేయాల్సింది ఏమిటో తెలుసుకోవడం ధర్మం. తెలుసుకున్నదానిని ఆచరణలో పెట్టడానికి నిరంతరం ప్రయత్నించడం, మరింతమందిచేత ధర్మాన్ని పాటించేలా చేయడం ధర్మం. రకరకాలుగా ఆలోచనలు కలిగి ఉన్న మనుషులు, రకరకాల ప్రయోజనాలు పొందుతున్న మనుషులు ఒకేరకం ధర్మాన్ని పాటించడం అంత తేలికగా సాధ్యమయ్యేది కాదు. అసాధ్యం అయినదీ కాదు. పైగా అనివార్యమైంది కూడా. మనుషులలో అంతరాలు ధర్మం కాదు. మనుషులలో అకృత్యాలు ధర్మం కాదు. మనిషిని మనిషి దోపిడీ చేయడం ధర్మం కాదు. ఇలాంటి అధర్మాలను ఎదర్కునే శక్తిని వ్యక్తులుగా కంటే సమూహంగా మాత్రమే ఎదుర్కోవడం సాధ్యం అవుతుంది. ధర్మాన్ని ఆచరించే వారి సంఖ్య పెరిగితే మాత్రమే ధర్మాన్ని కాపాడలేము. అధర్మాన్ని ఎదుర్కోవడమూ ధర్మమే. కనుక ధర్మాన్ని కాపాడడం అంటే అధర్మాన్ని ఎదుర్కోవడం, రూపుమాపడం కూడా. కనుక నిరంతరం ధర్మాన్ని ప్రచారం చేయాలి. చర్చలలో ఉంచాలి. ఆచరించేవారి సంఖ్య పెరగాలి. అధర్మంపై పోరాడుతూ ఉండాలి.

ప్రకృతి జీవన విధానమే అసలైన ధర్మం. అంటే ప్రకృతి ధర్మాలే అసలైన ధర్మం. ప్రకృతి ధర్మాలని తెలుసుకుని ప్రకృతికీ మనిషికీ ఇతర జీవరాసులకూ ఉన్న సంబంధాలను తెలుసుకుని వాటి ప్రయోజనాలను కాపాడడమే ధర్మం. ప్రకృతిని ఎలా వాడుకోవాలి? ప్రకృతిని ఎలా కాపాడుకోవాలి? ప్రకృతిని ఎవరు, ఎందుకు నాశనం చేస్తున్నారు అనేది తేల్చడం, తెలియజెప్పడం, అడ్డుకోవడం, అడ్డుకట్టవేయడం ధర్మం. కాబట్టి ధర్మాన్ని తెలుసుకుందాం. ధర్మాన్ని ఆచరిద్దాం. అధర్మంపై నిరంతరం సమిష్టిగా పోరాటం చేద్దాం. ధర్మో రక్షతి రక్షిత:.


# సద్గురుపరంపరతో నవభారతాన్ని నిర్మిద్దాం

- అమ్మఒడికి దూరమౌతున్న బాల్యం
- సిలబస్‌లో వ్యక్తిత్వ వికాసమేది?
- దిగజారుతున్న గురుస్థానం
- చదువు 'కొనే' రోజులు పోవాలి











అజ్ఞాన పొరలు తొలగించి జ్ఞానాన్ని వెలిగించేవాడు గురువు. 'గు' అంటే చీకటి 'రు' అంటే పోగొట్టేది అని అర్థం. అలాంటి గురువును దైవం కన్నా ఎక్కువగా గౌరవించే నేల మనది.

**గురుర్ బ్రహ్మా..**
**గురుర్ విష్ణు:..**
**గురుదేవో మహేశ్వర:..**
**గురుసాక్షాత్ పరబ్రహ్మా..**
**తస్మై శ్రీ గురవే నమ:..**

అంటూ గురువుకి దైవస్థానాన్నిచ్చి గౌరవించిన నేల మనది. సద్గురువుల చేతిలో ఎందరో మహనీయులు తయారైన చరిత్ర మనది. నేడు ఆ పరిస్థితి మచ్చుకైనా కానరావడం లేదు. గురువుల స్థానం దిగజారడం, విద్యావ్యవస్థలో కార్పో'రేటు' శక్తులు నిండడం, విద్యావిలువలు నశించడం, తొలిబడి అయిన అమ్మఒడికి సైతం బాల్యం దూరమవుతోన్న ప్రమాదకర జీవనవిధానం నెలకొంది. విలువలతో కూడిన నాటి విద్యావిధానం, పసితనం కోల్పోని బ్రహ్మానందంతో విద్యనేర్పే గురువులకూ నేటి పరిస్థితికీ ఏమాత్రం పొంతన లేకుండా పోయింది. విద్యారంగంలో నేడు నెలకొన్న పరిస్థితులు, దిగజారుతున్న విలువలు ఆందోళనకరంగా మారాయి. తక్షణమే పరిస్థితిని చక్కదిద్దుకోకపోతే భవిష్యత్ తరంలో కనీస విలువలనేవి మృగ్యం కావడం ఖాయం. ఇప్పటికే విలువలకు అర్థం మారిపోతున్న..., తెలుసుకునే...., తెలుపగలిగే.... స్థితి లేని సమయంలో ఎంతో విలువైన, ఆదర్శవంతమైన, సదా ఆచరణీయమైన నాటి మన విద్యావిధానాన్ని, సద్గురువుల స్థానాన్ని పదిలపరచుకోకపోతే భావితరం మనల్ని క్షమించే అవకాశం ఉండదు.

చాణుక్యుని చేతిలో చంద్రగుప్త మౌర్యుడు, సమర్థ రామదాసు చేతిలో ఛత్రపతి శివాజి, రామకృష్ణ పరమహంస చేతిలో వివేకానందుడు, గోపాలకృష్ణ గోఖలే చేతిలో మహాత్మాగాంధీ, స్వామి హరదాసు చేతిలో తాన్‌సేన్, జి.హెచ్ హర్టీ నుండి శ్రీనివాస రామానుజన్, రమాకాంత్ ఆచ్రేకర్ నుండి సచిన్ టెండూల్కర్, శ్రీనివాస కాలే నుండి శంకర మహాదేవన్, ద్రోణాచార్యుని నుండి అర్జునుడు, ఆచార్య వేద వికర్మ నుండి అశోకుడు మొదలగు అత్యద్భుత గురువులు తమ శిష్యులను తమ కన్నా ప్రచండ శక్తులుగా తయారుచేసిన భూమి భారతదేశం. పురాణాలలోనూ, చరిత్రలోనూ ఎందరో తల్లులు తమ బిడ్డలను ఆదర్శమూర్తులుగా తయారుచేసినట్లు విన్నాము. చరిత్రలో చదువుకున్నాము. ఆధునిక కాలంలో ఆనందకుమార్, ఆదిత్యకుమార్, రాజ్‌కుమార్, శర్మ, అబ్దుల్ మాలిక్, బాబర్ అలీ, అరవింద్ గుప్త, రోషిణి ముఖర్జీ, ఆచార్య సందీప్ చేశాయ్, విమల్ కౌల్, భారతీకుమారి, వరుణ్ బిశ్వాస్, రహమన్ ఖాన్ వంటి గురువులు తమ శిష్యులను దేశ శక్తులుగా తయారు చేస్తున్నారు.

**తరగతి గది ఒక ప్రసూతి గది**
**జ్ఞానానికి జన్మనిచ్చేందుకు**

**తరగతి గది ఒక శ్మశాన వాటిక**
**అజ్ఞానాన్ని ఖననం చేసేందుకు**

**తరగతి గది ఒక కర్మాగారం**
**జాతి భవితను నిర్మించేందుకు**

**తరగతి గది ఒక న్యాయస్థానం**
**సరైన నిర్ణయాలు తీసుకునేందుకు**
**---సర్వేపల్లి రాధాకృష్ణన్**

బ్రహ్మానందం పొందే పసిహృదయులు నాటి గురువులు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మ దినమైన సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటూ ఆ మహానాయకునికి ఘనమైన నివాళులు అర్పిస్తున్నాం. ప్రతిభ ఉన్న విద్యార్థులను సాన పెడుతూనే తరగతి గదిలో బలహీనమైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిలో తన మేధస్సుతో, జ్ఞానంతో, సహనంతో జ్ఞాన జ్యోతులు వెలిగించడమే 'గురువు' పని. సహనం, క్షమ, లాలన, పాలన, సాధికారతతో స్వప్రయోజనం కన్నా విద్యార్థి ప్రయోజనమే ముఖ్యమని ప్రతిక్షణం తపించే గురువులు భగవతే స్వరూపాలుగా చెప్పవచ్చు. తమ శిష్యులు ప్రపంచ గమనంలో అద్భుతంగా రాణిస్తుంటే సగర్వంగా బ్రహ్మానందం పొందే ససి హృదయులు గురువులు. కేవలం దేశ ఔన్నత్యం కోసం దేశ భవిష్యత్‌కోసం సమర్థులైన శిష్య బృందాలను తయారు చేయటమే వారి ప్రధమకర్తవ్యంగా భావిస్తారు.

**"ఎగిరే గాలిపటం విద్యార్థి అయితే**
**ఆధారం అయిన దారం గురువు"**

అన్నట్లు గాలిపటంలా శిష్యుడు అత్యున్నత స్థితికి చేరుకోవటానికి ఆధార భూతమైన దారంలా గురువు అనునిత్యం పాటు పడతాడు.

**మన జననం ఓ సాధారణమైనది కావచ్చు . కానీ, మన మరణం మాత్రం ఒక చరిత్ర సృష్టించేదిగా ఉండాలి**
**---డాక్టర్ అబ్దుల్ కలాం.**

తన చివరి శ్వాస వరకు విద్యార్థులతో మమేకమై వారి మధ్యే చివరి శ్వాస విడిచిన అద్భుత గురువు అబ్దుల్ కలాం నిత్య స్మరణీయుడు.

**సామాన్య జనంలోకి ఎంతగా చదువు సంధ్యలు చొచ్చుకొని పోతాయో అంతగా ఆ దేశం అభివృద్ధి చెందుతుంది.**
**--- స్వామి వివేకానంద**

ప్రతి సమస్యకు పరిష్కారం 'చదువు' మాత్రమే అని నమ్మి దేశ 'యువత' అద్భుతంగా ప్రేరేపించిన స్వామి వివేకానంద కన్నా పరమ గురువు ఎవరు? పరమాచార్యులు, అపురూపమైన గురువులు జన్మించిన ఈ దేశంలో ఆధునిక కాలంలో 'గురువు' స్థానానికి ఎటువంటి గౌరవం లభిస్తోంది?

### నేటి 'గురువుల' స్థానమెక్కడ...?!

వెకిలి చేష్టలతో, హాస్యానికి సాధనంగా మార్చి నేటి గురువును సినిమా మాధ్యమానికి ఇరుసుగా చేసుకున్న వికృత పరిస్థితి మనం చూస్తున్నాం. బఫూన్లుగా, పనికిమాలిన వ్యక్తులుగా, కేవలం వినోదాన్ని అందించే వస్తువుగా చూడడాన్ని గర్హించాలి. విద్యా వ్యవస్థలో ఉన్న నిర్లిప్తత, నిర్లక్ష్యం, నిత్తేజం, మంచి గురువులను కాలదన్ని తన నాశనాన్ని కొని తెచ్చుకుంటోంది. 'గురువు' అనే శబ్దం వేగంగా సమాజం నుండి కనుమరుగవుతోంది. "తరగతి గది ఒక అద్భుత ప్రయోగశాల" అనుకునే గురు పరంపర నేడు మృగ్యమై పోయింది. విద్యా వ్యవస్థలోని అన్ని అంగాలు వ్యాపార ధోరణికి ఆలవాలమై "కార్పోరేటు" వ్యాపార సంస్థలుగా మారిపోవడం అత్యంత బాధాకరం.

### అమ్మఒడికి దూరమై.... కార్పోరేటుకు బలౌతున్న బాల్యం

అ ఆ లు నేర్చుకోవడానికి "లక్షలు చెల్లించాలంటే" మనం ఎప్పుడైనా అనుకున్నామా? తొలి గురువైన 'అమ్మ' ఒడిలోనే పెద్దబాల శిక్షను కంఠతో పట్టిన మనం నేడు మన తరువాతి తరానికి నేర్పించే జ్ఞానం లేక, ఓపిక లేక ముక్కుపచ్చలారని బిడ్డలను 'డే' కేర్, 'ప్లే స్కూల్' పేరుతో లక్షలు చెల్లించి ఏం నేర్పిస్తున్నామో ఆలోచించాలి. దీనికి కారణం మన "తొలి గురువైన అమ్మ" తన ధర్మాన్ని తాను విస్మరించటమే. ఆధునిక కాలం సాంకేతిక విప్లవం, ధనార్జనే పరమావధిగా మార్చుకొని 'దేశ భవిష్యత్'ను బలిపెడుతున్నారు. కుమారులకు వీరగాథలు, నీతికథలు నేర్పి వీరమాతలుగా చరిత్రలో నిలచిన తల్లులు నేడు కనబడడం లేదు. సంపాదన వేటలో మాతృత్వపు విలువలు మసకబారుతున్నాయి. ఈ పరిస్థితిని ప్రతి తల్లి తన హృదయంతో ఆలోచించాలి. తల్లిని మించిన గురువు లేదన్నది అక్షరసత్యం. తొలిగురువు స్థానం ఎపుడైనా... ఎక్కడైనా తల్లిదే. ప్రకృతి సహజమైన ఈ అంశాన్ని మన సంస్కృతికి దూరం చేస్తున్న జీవన విధానంతో సాధించేదేమిటో లోతుగా ఆలోచించాలి.

### సిలబస్‌లో వ్యక్తిత్వవికాసమెక్కడ?!

ఇక 3 సంవత్సరాలు నిండని పసివాళ్ళపై వ్యాపార దృక్పథంతో జాతీయ, అంతర్జాతీయ, ఐఐటి సిలబస్ పేర్లతో, బండెడు పుస్తకాలతో దాడి చేస్తూ వారికి చదువు అంటే కర్మాగారాల్లో తయారయ్యే వస్తువుగా ప్రదర్శింపచేయడం దు:ఖాన్ని కలిగిస్తుంది. వ్యక్తిత్వ వికాసం, మనోవికాసం, బహుముఖ ప్రజ్ఞ అనేది విద్యార్థినీ తీర్చిదిద్దే సమున్నత లక్షణాలుగా భావించిన గురువుల స్థానంలో విషయాన్ని మాత్రమే భోదించే యంత్రాలుగా అధ్యాపకులు ఉండటం మన దురదృష్టం. సిలబస్‌లో నీతికథలకూ, వ్యక్తిత్వ వికాసానికి కనీసం స్థానం కనబడడం లేదు. సంపాదించే యంత్రాలుగా మాత్రమే తయారుచేసేలా సిలబస్, శిక్షణా ఉంటున్నాయి. ఇరుకు గదులలో ఏ మాత్రం వికాసంకు అవకాశం లేని విచక్షణా రహితమైన, క్రూరమైన పరిస్థితులలో విద్యాభ్యాసం చేసినవారు ర్యాంకులు సాధిస్తారేమోగానీ సామాజిక, సాంఘిక, వ్యక్తిగత సమస్యలను ఎదుర్కోవడంలో, పరిస్థితులను సమర్ధవంతంగా అధిగమించడంలో ఘోరంగా విఫలం అవుతుండడం అనేక సందర్భాలలో చూస్తున్నాము.

### తల్లిదండ్రులూ ఆలోచించండి....!

దీనికి గల మూల కారణాలను విశ్లోషించుకోవలసిన సమయం ఆసన్నమైంది. ధనం విద్యను మ్రింగటం సమాజానికి ఏ మాత్రం మంచిది కాదు. తల్లిదండ్రుల మూర్ఖపు ఆలోచనలు, శక్తికి మించి తమ పిల్లల భవిష్యత్‌ను ఊహించడం, తమ ఆశలు, ఆకాంక్షలను తమ పిల్లల ద్వారా నెరవేర్చుకునే క్రమంలో వారి మన:స్థితిని గమనించకుండా బలవంతంగా నెత్తిన రుద్దడం, కేవలం యాజమాన్య ఆకాంక్షలను పరిగణలోనికి తీసుకొని సంకెళ్ళలో బంధించుకున్న అధ్యాపకుల వల్ల స్వేచ్ఛగా ఎదగవలసిన వి ద్యా ర్థి చివరకు ఏమవుతున్నాడో ప్రతిరోజు చూస్తున్నాం.

### నవభారతాన్ని నిర్మిద్దాం....!

అధ్యాపకునికి స్వేచ్ఛా వాతావరణం కల్పించాలి. తన తరగతిలోని ప్రతి విద్యార్థితో మమేకమయ్యే అవకాశం కల్పించాలి. ఏ దేశం ఐతే తనకన్న మేధావులైన గురుపరంపరతో ప్రపంచానికి తలమానికంగా నిలిచిందో అటువంటి మహోన్నత దేశాన్ని మనం నిర్మించుకోవలసిన విధానం అత్యంత వేగంగా జరగాలి.

**భారతమాత సేవలో**
**ఒప్పుకోను పరాజయం**
**కొత్తదారి నా ధ్యేయం..**

అంటూ సరిక్రొత్త దారిలో 'గురువు' కున్న స్థానాన్ని పదిలపరుచుకుని, గౌరవించుకుని, మార్గదర్శకునిగా ఎంచుకుని ముందుకు సాగుదాం.. నవభారత నిర్మాణాన్ని చేపడదాం.



- అట్లూరి వెంకటరమణ
కవి, రచయిత, అధ్యాపకుడు.

## జనవిజయం మంచిమాట-01

**సత్యాన్ని కనుగొనగలం, తప్ప సృష్టించలేము**

- రాహుల్ సాంకృత్యాయన్



## ఇవి తింటే యవ్వనంగా కనిపిస్తారు

ప్రస్తుతతరుణంలో మహిళలు నిత్యం ఎంతటి ఒత్తిడిని అనుభవిస్తు న్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇంటి పనులు, కుటుంబ సమస్యలు,ఆర్థిక ఇబ్బందులతోవారు సతమతం అవుతున్నారు. ఇం ట్లోనిఅందరి ఆరోగ్యం, బాగోగులను వారు చూస్తారు. కానీ తమఆరోగ్యంగురించి తామే పట్టించుకోరు. ఇక పనిచేసేమహిళలు అయితే ఓవైపు కుటుంబాన్ని,మరోవైపు పని ఒత్తిడిని ఎదుర్కొం టూ అవస్థలు పడుతుంటారు. ఇలా ఒత్తిడి బారిన పడుతున్న మహిళలు చాలా త్వరగావృద్ధాప్యంలోకివచ్చేసినట్లు కనిపిస్తారు.30 లేదా 40 ఏళ్ల వయస్సులోనే వృద్ధులు అయిపోయినట్లు కనిపిస్తారు. అయితే కొన్ని రకాల ఆహారాలను తరచూ తీసుకుంటే ఒత్తిడి తగ్గడంతోపాటుచర్మం యవ్వనం గాకనిపించేలాచేయవచ్చు. దీంతో వృద్ధాప్య ఛాయలు తగ్గుతా యి. వయస్సు మీద పడినా కూడా యవ్వనంగానే కనిపిస్తా రు. ఇక మహిళలు యవ్వనంగా కనిపించాలంటే తీసుకోవాల్సిన ఆ ఆహారా లు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.పాలు,పెరుగు..: మహిళలు రోజూ పాలను తాగుతుండాలి. పాలలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. అయితే కొవ్వు శాతం తక్కువగా ఉండే పాలనే తాగాల్సి ఉంటుంది. పాలలో ఎముకలను బలంగా ఉంచేక్యాల్షి యం, విటమిన్‌డి, విటమిన్ సిఅధిక మొత్తంలో ఉంటాయి. ఇవి స్త్రీలకు పోషణను అందిస్తాయి. చర్మాన్ని సంరక్షిస్తాయి.చర్మం యవ్వ నంగా కని పించేలా చేస్తాయి. అలాగే కొవ్వు తక్కువగా ఉండే పెరుగును కూడా స్త్రీలు తీసుకోవాలి. ఇది చర్మానికి ఎంతో మేలుచేస్తుంది. ఇలాంటి పెరుగును తింటే రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతా యనిపరిశోధకులు చెబుతున్నారు. కడుపులో మంట,గ్యాస్ వంటి సమస్య లతో బాధపడేవారికి కూడాపెరుగు ఎంతగానోమేలు చేస్తుంది. స్త్రీలకు వచ్చేకొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు, అల్సర్లను కూడా పెరుగు తగ్గిస్తుంది. చర్మాన్ని సంరక్షిం చడంతోపాటు యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.

6-12 april, 2025_Layout 1 4/22/2025 7:49 PM Page 3



# వైసీపీకి కొత్త కష్టాలు


విజయవాడ : వైఎస్సార్ కాంగ్రెస్పార్టీకి కొత్త కష్టం ప్రారంభమైంది. కేంద్రానికి ఆ పార్టీ వ్యతిరేకమైంది. ఇందుకు వక్ఫ్ సవరణ బిల్లు కారణమైంది. కేంద్ర ప్రభుత్వం గత కొద్ది రోజులుగా ఈ బిల్లు సవరణకు ప్రయత్నిస్తూనే ఉంది. కానీ ఎట్టకేలకు అది సాకారం అయ్యింది. పార్లమెంటు ఉభయ సభల్లో సైతం ఆ బిల్లు ఆమోదం పొందింది. అయితే ఏపీకి సంబంధించి టిడిపి తో పాటు జనసేన మద్దతు తెలిపాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం వ్యతిరేకించడంతో పాటు వ్యతిరేకంగా ఓటు వేసింది కూడా. సహజంగానే ఇది కేంద్రానికి మింగుడు పడని విషయం. అందుకే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీరుపై కేంద్రం ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో వైయస్సార్ కాంగ్రెస్ లో సైతం ఆందోళన వ్యక్తం అవుతోంది. పాత కేసులను తిరగతోడే అవకాశం ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇప్పటికే వైసీపీపై విరుచుకుపడుతోంది. దీనికి కేంద్రం తోడైతే ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. వాస్తవానికి 2014 నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితోఎటువంటి శత్రుత్వం పెంచుకోలేదు. 2014లో టిడిపి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ విజయం సాధించింది. అయితే ఏపీలో మాత్రమే టిడిపిని వ్యతిరేకించింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిని పల్లెత్తు మాట అనలేదు. పైగా స్నేహాన్ని కొనసాగించింది. నాడు ప్రత్యక్షంగా తెలుగుదేశం పార్టీతో పొత్తు కొనసాగించింది బిజెపి. కానీ తెర వెనుక అదే స్నేహం వైసిపి తో సైతం కొనసాగించిందన్న విమర్శ ఉంది. అప్పట్లో అందుకే చంద్రబాబు ఎన్డీఏ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇలా టిడిపి బయటకు వెళ్లిందో లేదో బిజెపితో బాహటంగానే స్నేహం చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఆ పార్టీ బిజెపికి మిత్రపక్షంగానే కొనసాగింది. అయితే ఎక్కడ అధికారికంగా జరగలేదు. దానికి కారణం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ముస్లిం మైనారిటీల మద్దతు ఉంది. బిజెపితో బహిరంగంగా వ్యవహరిస్తే ముస్లిం మైనారిటీలు దూరం కావడం ఖాయం. దానికి భయపడే మొన్నటి ఎన్నికల్లో బిజెపి పొత్తు ప్రతిపాదనను కూడా జగన్మోహన్ రెడ్డి తిరస్కరించారు. అటు బిజెపి సైతం చివరి వరకు వేచి చూసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒప్పుకోకపోవడంతోనే తెలుగుదేశంతో జతకట్టేందుకు సిద్ధపడింది. అయితే గత ఐదేళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అన్ని విధాల స్వేచ్ఛ ఇచ్చింది బిజెపి. కానీ అటువంటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈరోజు బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేయడం మాత్రం ఆలోచించాల్సిన విషయమే. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తరువాత లోక్సభ స్పీకర్ ఎన్నిక విషయంలో బిజెపి అడగకముందే మద్దతు ప్రకటించింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ. చాలా రకాల బిల్లుల ఆమోదానికి మద్దతు ఇచ్చింది కూడా. మొన్నటికి మొన్న డి లిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని స్టాలిన్ నేతృత్వంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆ సమావేశానికి హాజరైతే బిజెపికి వ్యతిరేక ముద్ర పడుతుందని భావించిన జగన్మోహన్ రెడ్డి అటువైపు చూడలేదు. మద్యేమార్గంగా కేంద్రానికి లేఖ రాసి ఊరుకున్నారు. కానీ అటువంటి జగన్మోహన్ రెడ్డి పార్టీ ఎంపీలకు విప్ జారీచేసి మరి వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయించడం అంటే చిన్న విషయం కాదు. దీనిపై బిజెపి అగ్రనేతలు ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. ఇకనుంచి జగన్మోహన్ రెడ్డి విషయంలో ఉదాసీనంగా వ్యవహరించకూడదని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# స్టీల్ ప్లాంట్ నుంచి 3,823 ఉద్యోగులు తొలగింపు

## సమ్మెకు సిద్ధమౌతున్న కార్మిక సంఘాలు

విశాఖపట్టణం : వైజాగ్ స్టీల్ప్లాంట్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు విషయంలో యాజమాన్యం వెనక్కి తగ్గడం లేదు. దశలవారీగా తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు దశల్లో 2,603 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారు. ఇప్పటకే 1,223 మంది పర్మినెంట్ ఉద్యోగులు వీఆర్ఎస్ తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థ వైజాగ్ స్టీల్ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ -ఆర్ఐఎన్ఎల్) ప్రైవేటీకరణ పనులు చకచక జరుగుతున్నాయి. ఒకపక్క అధికార టీడీపీ నేతలు ప్రైవేటీకరణ కాదని చెబుతున్నారు. కానీ మరోవైపు వైజాగ్ స్టీల్ప్లాంట్లో చోటు చేసుకున్న పరిణామాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణ అనుకూల విధానాలు అమలు జరుగుతున్నాయి. పెద్ద ఎత్తున కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు జరుగుతోంది. పర్మినెంట్ ఉద్యోగులను వీఆర్ఎస్ ద్వారా ఇంటికి పంపించే చర్యలు చేపడుతున్నారు. వైజాగ్ స్టీల్ప్లాంట్లో మూడు నెలలకు 1,400 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించాలని, అలా ఏడాదికి 5,600 మంది ఉద్యోగులను తొలగించాలని స్టీల్ప్లాంట్ యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే గతంలో 1,100 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించగా, తాజాగా మరో 1,503 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను ఇంటికి పంపారు. మరో 440 మంది కాంట్రాక్ట్ కార్మికులను రెన్యూవల్ చేయకుండా బయట ఉంచారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని రీజినల్ లేబర్ కమిషనర్ వద్ద చర్చలు కొనసాగుతున్నాయి. ఉక్కు మంత్రిత్వ శాఖ నుంచి యాజమాన్యంపై రోజు రోజుకు పెరుగుతున్న ఒత్తిడి కారణంగా.. ప్రతిరోజూ వందల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగిస్తున్నారు. మొదటిలో మెడికల్ ఫిట్నెస్ లేనివారిని, 55 ఏళ్ల పైబడినవారిని తొలగించాలని యాజమాన్యం నిర్ణయించింది. అందుకు సంబంధించిన జాబితాను విడుదల చేసింది. స్టీల్ప్లాంట్లో దాదాపు 15,000 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, దాదాపు 10,000 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో ఇప్పటి వరకు 2,603 మందిని తొలగించారు. పర్మినెంట్ ఉద్యోగుల్లో 1,223 మంది వీఆర్ఎస్ తీసుకున్నారు. ఇలా దశలవారీగా కాంట్రాక్ట్ ఉద్యోగులు, పర్మినెంట్ ఉద్యోగులు సంఖ్యను తగ్గిస్తున్నారు. ఉద్యోగుల సంఖ్య తగ్గుదల స్టీల్ ఉత్పత్తిపై ప్రభావం చూపుతుందని, ఇప్పటికే సెయి-ంల్తో పోల్చితే వైజాగ్ స్టీల్ప్లాంట్లో ఉద్యోగులు తక్కువగా ఉన్నారని ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఇప్పుడు ఉద్యోగులను తగ్గించడంతో మరింత నష్టం వాటిల్లుతుందని అన్నారు. వైజాగ్ స్టీల్ప్లాంట్లో సమ్మె సైరన్ మోగింది. ఈనెల 16 నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగుతున్నారు. మొత్తం 15,000 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు సమ్మెకు వెళ్లనున్నట్లు అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ నిర్ణయం తీసుకుంది. స్టీల్ప్లాంట్ యాజమాన్యం దిగొచ్చే వరకు సమ్మె చేపట్టాలని నిర్ణయించింది. సమ్మెకు ముందుగా శనివారం కూర్మన్నపాలెంలో భారీ రాస్తారోకో చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈనెల 7న రీజనల్ లేబర్ కమిషనర్తో మరోసారి చర్చలు జరపాలని నిర్ణయించింది. అలాగే ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. అనంతరం సమ్మెలోకి కాంట్రాక్ట్ ఉద్యోగులు వెళ్లనున్నారు

# బ్రూనో బలిదానం వృథా కారాదు



సైన్స్ ఎప్పుడూ వాస్తవాలపై ఆధారపడి పని చేస్తుంది. మతం నమ్మకాల ఆధారంగా మనుగడ సాగిస్తుంది. మధ్య యుగం వరకు మతం ప్రపంచ వ్యాప్తంగా తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. మతాల పేరుతో వివిధ వర్గాల వారు తీవ్రంగా ఘర్షణ పడ్డారు. మతాధిపతులు రాజులను సైతం నియంత్రణ చేసేవారు. 15వ శతాబ్దంలో యూరప్లో అనేక మంది శాస్త్రవేత్తలు మత భావనలకు విభిన్నమైన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు తగిన రుజువులను కూడా చూపించారు. ఇందులో గెలీలియో, బ్రూనో, కోపర్నికస్ అగ్రగణ్యులు. ఈ క్రమంలో వీరు మతవాదుల నుంచి ఎదురు దాడిని ఎదుర్కొన్నారు. గెలీలియో జైలు శిక్ష అనుభవించగా, బ్రూనో ఏకంగా దారుణంగా హత్యకు గురయ్యాడు. మత గ్రంథాలలో చెప్పిన విషయాలకు విరుద్ధమైన సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని సమర్ధించినందుకు క్రైస్తవ మత పెద్దలు బ్రూనోను సజీవ దహనం చేశారు. ఆయన కూడా క్రైస్తవ సన్యాసే కానీ క్రైస్తవ పెద్దలు ఆమోదించిన భూకేంద్ర సిద్ధాంతాన్ని నమ్మలేదు. ప్రతి నక్షత్రం చుట్టూ గ్రహాలు తిరుగుతాయని, ఈ భూమి లాంటి భూములు విశ్వంలో ఇంకెన్నో ఉంటాయని చెప్పాడు. విశ్వం అనంతం అన్నాడు. 1548లో ఇటలీలో జన్మించిన బ్రూనో కోపర్నికస్ సిద్ధాంతానికి ఆకర్షితుడైనాడు. 1572లో బ్రూనో మత గురువుగా వున్నప్పటికీ, సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం మొదలు పెట్టాడు. దీనిపై మరింత పరిశీలనలను, పరిశోధనలను చేసి మరిన్ని అదనపు అంశాలను చేర్చి అనంత విశ్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. బ్రూనో ప్రతిపాదనలు మత విశ్వాసాలకు విరుద్ధమైనవని మత బోధకులు భావించి, బ్రూనోపై 131 అభియోగాలను మోపి 1591లో కేసును నమోదు చేశారు. 1593లో బ్రూనోను గాలి, వెలుతురు చొరబడని ఒక కారాగృహంలో బంధించి ఎన్నో హింసలకు గురిచేశారు. ఈ కారాగారంలో బ్రూనో సుమారు ఏడు సంవత్సరాలకు పైగా వున్నాడు. ప్రతి రోజూ మత గురువుల నుంచి బ్రూనోకు వర్తమానం వచ్చేది. దాని సారాంశం బ్రూనో తన ప్రతిపాదనలు తప్పని ఒప్పుకోవడం, సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ఖండించడం, తాను ప్రచారం చేసిన అంశాలు తప్పని బహిరంగంగా ఒప్పుకోవడం. అయితే ప్రతి రోజూ బ్రూనో ఈ ప్రతిపాదనలు తిరస్కరించేవాడు. చివరకు బ్రూనోను మత ద్రోహిగా, సైతానుగా, రెచ్చగొట్టే ఉపన్యాసకుడుగా, మతానికి పరమ శత్రువుగా ప్రకటించి, ఒక్క రక్తం బొట్టు నష్టపోకుండా అగ్నికి ఆహుతి చెయ్యాలన్న మరణ శిక్షకు ఆదేశాలు జారీ చేశారు. 1600 ఫిబ్రవరి 17 మత పెద్దల ఆదేశాల మేరకు బ్రూనోను ఇనుప సంకెళ్ళతో బంధించి, పెడరెక్కలు విరిచికట్టి, నరకయాతన చూపించి, సజీవ దహనం చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ రోజులలో కూడా మతోన్మాదులు సైన్స్ వాదులపై దాడులు చేస్తున్నారు. ఎవరు ఏం తినాలి, ఏ దుస్తులు వేసుకోవాలి అనే విషయాలపై కూడా ఆంక్షలు పెడుతున్నారు. మరోవైపు మూఢ నమ్మకాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితుల్లో బ్రూనో వంటి త్యాగధనుల స్ఫూర్తితో నేటి సైన్స్వాదులు పని చేయాలని జనవిజయం కోరుకుంటోంది.

# వంగవీటి రాధ ఎదుగుదలకు పవన్ అడ్డుగా నిలుస్తున్నారా?

విజయవాడ : వంగవీటి రంగా హత్య తర్వాత ఆ కుటుంబంలో ఎవరికీ రాజకీయాలు పెద్దగా కలసి వచ్చినట్లు కన్పించడం లేదు. ఒకసారి రంగా సతీమణి రత్నకుమారి, మరొకసారి కుమారుడు వంగవీటి రాధా ఎమ్మెల్యేగా గెలవడం తప్పించి తర్వాత గెలుపు పిలుపు వినిపించలేదు. ఎన్ని పార్టీలు మారి ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. తల్లీ కొడుకులకు కేవలం చెరొక సారి మాత్రమే ఎమ్మెల్యే అవకాశం లభించింది. దశాబ్దాల కాలం నుంచి రాజకీయ పదవులకు వంగవీటి కుటుంబం దూరంగానే ఉంటుంది. 2019 ఎన్నికలకు ముందు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన వంగవీటి రాధాకు తర్వాత 2014లో వైసీపీలో చేరారు. అప్పుడూ ఓటమి పాలయ్యారు. పార్టీ కూడా అధికారంలోకి రాలేకపోయింది. 2019 ఎన్నికలకు ముందు ఆయన టీడీపీలో చేరినా ఫలితం కనిపించలేదు. టీడీపీ ఓటమి పాలవ్వగా, ఆయనకు టిక్కెట్ కూడా దక్కలేదు. 2024 ఎన్నికల్లోనూ వివిధ కారణాలతో ఆయన పోటీకి దూరంగా ఉంచింది టీడీపీ అధినాయకత్వం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయాలని సూచించింది. వంగవీటి రాధా రాష్ట్ర మంతటా పర్యటించారు. అనేక సభల్లో పాల్గొన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, మచిలీపట్నం,గుడివాడ ఇలా అన్ని ప్రాంతాల్లో పర్యటించారు. అధికారంలోకి రాగానే



నాడు టిక్కెట్ కూడా దొరకలేదు. 2024 ఎన్నికల్లోనూ ఆయనకు ఎక్కడా టిక్కెట్ కేటాయించలేదు. ఇప్పుడు వంగవీటి రాధాకు ఎమ్మెల్సీగా పదవి వచ్చేది కూడా కష్టంగా మారింది. కాపు సామాజికవర్గానికి బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్న వంగవీటి కుటుంబాన్ని అన్ని పార్టీలూ పక్కన పెడుతున్నాయి. ప్రధానంగా టీడీపీ కూడా ఇప్పుడు పక్కన పెట్టడానికి ఎక్కువ మంది కాపులకు మొన్న అవకాశం కల్పించడమే. ఎమ్మెల్సీలుగా ఐదు పోస్టులు ఖాళీఅయినా, అదీ ఎమ్మెల్యే కోటాలో అయినా ఖచ్చితంగా ఇచ్చిన హామీ మేరకు వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ పదవి దక్కుతుందని అందరూ భావించారు. కానీ జనసేన నుంచి కొణిదల నాగబాబు, బీజేపీ నుంచి సోము వీర్రాజులను ఆ పార్టీ నాయకత్వాలు ఎంపిక చేయడంతో వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేని పరిస్థితి టీడీపీ నాయకత్వానికి ఎదురైంది. మిగిలిన సామాజికవర్గాలకు ఇవ్వాల్సి వచ్చింది. వంగవీటి రాధా 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి ఓటమి పాలయ్యారు. ప్రజారాజ్యం నుంచి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని టీడీపీ అధినాయకత్వం స్పష్టమైన హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత వరకూ వంగవీటి రాధాకు పదవి రాకపోవడానికి అనేక కారణాలున్నాయి. వంగవీటి రాధా కంటే ఇప్పుడు కాపు సామాజికవర్గంలో పవన్ కల్యాణ్ పవర్ ఫుల్లుగా ఉన్నారు. ఆయన కాపులందరినీ ఏకతాటిపైకి తేగలిగిన నాయకుడు కావడంతో ఇక రాధాతో పనేంటి? అన్న ధోరణిలో టీడీపీ నాయకత్వం ఉన్నట్లు కనపడుతుంది. మరోవైపు జనసేన ఇచ్చే పదవులు కాపులకే అయినప్పుడు, తాము కూడా అదే సామాజికవర్గానికి ఇచ్చేదానికంటే మరొక క్యాస్ట్ కు ఇచ్చి ఆ ఓట్లను సొంతం చేసుకోవడానికి టీడీపీ నాయకత్వానికి మరొక దారి కనిపించడం లేదు. అందుకే వంగవీటి రాధా కంటే ఇప్పుడు పవన్ కల్యాణ్ ముఖ్యం కావడం, మిత్రపక్షంగా ఉండటంతో ఆయనకే ప్రయారిటీ ఇస్తారని, ఇక తమ నేతకు ఇచ్చే అవకాశం ఉండకపోవచ్చన్న భావన వంగవీటి రంగా అభిమానుల నుంచి వ్యక్తమవుతుంది.

# సీసీ కెమేరాలతో నేరరహిత తెలంగాణ

**కేసుల పరిష్కారంలో కీలకంగా ఫుటేజి**
**నిందితుల పట్టివేతలో తోడ్పడుతున్న దృశ్యాలు**
**శాంతి భద్రతల పరిరక్షణలోనూ ముఖ్య భూమిక**
**సాక్ష్యంలోనూ కీలకంగా మారిన ఫుటేజ్లు**



హైదరాబాద్,(జనవిజయం) : శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమేరాల పాత్ర కీలకంగా మారింది. సీసీ కెమేరాలతో నేరరహిత తెలంగాణ దిశగా అడుగులు వేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అందుకే వీటిని ఏర్పాటు చేసేందుకు హైదరాబద్ సహా అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారు. హైదరాబాద్లో ఏర్పాటయిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ కార్యాలయం ద్వారా అన్ని జిల్లాలను అనుసంధానం చేస్తారు. తద్వారా జిల్లాల్లో కూడా ఎప్పుడు ఏం జరిగినా ఇట్టే పసిగట్టే అవకాశం ఉంది. ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటవుతున్నాయి. అలాగే కొందరు ఔత్సాహికుల ద్వారా కూడా ఏర్పాటు చేయిస్తున్నారు. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ మంచి ఫలితాలనిచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో ఇవి కీలకంగా మారాయి. కేసులను పసిగట్టి కూపీ లాగడంలోనూ బాగా పనికి వస్తున్నాయి.

అందుకే కాలనీలు మొదలు, రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని వీలైనన్ని ఎక్కువచోట్ల సిసి కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని పోలీస్ అధికారులు కూడా ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించగలిగారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదన్నారు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమేరాల్కైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు. కోర్టుల్లో కూడా సీసీ కెమెరాల ద్వారా ఎటువంటి సంశయం లేకుండా శిక్షలు విధించే అవకాశాలు ఉంటాయని డీజీపీ తెలిపారు. అందుకే నగరంలో అన్ని ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణను నేరరహిత రాష్ట్రంగా తయారుచేసేందుకు పోలీస్శాఖ కృషి చేస్తున్నది. ప్రజల్లో భరోసా కల్పించేలా ముందుకు సాగుతున్నారు. ఇటీవల అనేక కేసుల పరిష్కారంలో సిసి కెమెరాల ఫుటేజీ కీలకంగా మారింది.

6-12 april, 2025_Layout 1 4/22/2025 7:49 PM Page 4



# ఏపీలో కొత్త బైపాస్‌లకు బాబు గ్రీన్ సిగ్నల్

నెల్లూరు : ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో హైవేలు, ఫ్లై ఓవర్లు, బైపాస్‌లను పూర్తి చేసే పనిలో ఉంది. ఈ మేరకు అమరావతిని కనెక్ట్ చేసే కీలకమైన విజయవాడ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముందుగా అనుకున్న ప్రకారం జూన్ చివరి నాటికి రోడ్డు పనులు పూర్తి చేసి వాహనాల రాకపోకలకు అనుమతించనున్నారు. కాజా నుంచి వెంకటపాలెం, గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు బైపాస్ వాహనదారులకు అందుబాటులోకి రానుంది. ఆ తర్వాత నాలుగు గ్రిడ్ రోడ్ల దగ్గర అండర్‌పాస్‌లు నిర్మిస్తారు. రాజధాని అమరావతిలో ప్రాంతంలో పనులు వేగంగా జరుగుతుండటంతో.. విజయవాడ బైపాస్‌ను త్వరగా పూర్తి చేయాలని సీఎం నిర్ణయించారు. ఈ బైపాస్‌తో రాజధాని ప్రాంతానికి హైవే అందుబాటులోకి వస్తుంది. నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్‌ను సులువుగా తరలించవచ్చు అంటున్నారు. విజయవాడ బైపాస్ (చెన్నై-కోల్‌కతా హైవే బైపాస్) కాజా నుంచి గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు ఉంది. కాజా-గొల్లపూడి ప్యాకేజీ 17.88 కి.మీ పొడవు ఉండగా.. ఇది రాజధాని అమరావతి ప్రాంతంలోని 9 గ్రిడ్ రోడ్ల మీదుగా వెళ్తుంది. ఈ మేరకు ఇ-3, ఇ-8, ఇ-10, ఇ-13, ఇ-15 గ్రిడ్ రోడ్లు క్రాస్ అయ్యే దగ్గర అండర్‌పాస్‌లను నిర్మించింది. వీటి వల్ల ఆయా గ్రిడ్ రోడ్లలో రాకపోకలు సాగించే వారికి ఇబ్బంది ఉండదు అంటున్నారు. కానీ ఇ-9, ఇ-11, ఇ-12, ఇ-14 గ్రిడ్ రోడ్ల దగ్గర మాత్రం అండర్-పాస్‌లు లేకుండానే బైపాస్ నిర్మాణం పూర్తి చేశారు. అంటే బైపాస్ క్రాస్ అయ్యే దగ్గర ఆ నాలుగు గ్రిడ్ రోడ్లు మూసుకుపోతాయి అంటున్నారు. ఈ రోడ్లపై వెళ్లాలంటే ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.. గతంలో దీని గురించి పట్టించుకోక పోయినా.. కూటమి ప్రభుత్వం చొరవతో ఔఊంఎ అధికారులు పనులు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వచ్చింది. వెంటనే ఆయన ఆ నాలుగు చోట్ల అండర్-పాస్‌లు ఉండాలని నిర్ణయించారు. దీంతో ఆ నాలుగు చోట్ల బైపాస్‌ను కట్ చేసి.. ఈ మేరకు అండర్‌పాస్‌ల నిర్మాణానికి అంచనాలు రూపొందించే పనిలో ఇంజినీర్లు ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు జాతీయ రహదారుల మంత్రి గడ్కరీతో మాట్లాడారు. రాజధాని పనులు వేగంగా జరుగుతున్నందున ముందు బైపాస్ నిర్మాణం పూర్తి చేయాలని.. ఆ తర్వాత నాలుగు గ్రిడ్ రోడ్ల వద్ద అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. అదే విజయవాడ బైపాస్ ఆపేసి నాలుగు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తి చేయాలంటే ఏకంగా 15 నెలల సమయం పడుతుంది. ఈ అంశాలను పరిశీలించి ముందు బైపాస్‌ను పూర్తి చేయాలని నిర్ణయించారు. పనులు వేగవంతం చేయాలని.. జూన్ ఆఖరు నాటికి బైపాస్ అందుబాటులోకి తీసుకోస్తామని ఔఊంఎ అధికారులు తెలిపారు.

# వైసీపీలోనే పోసాని యాక్టివ్?

కడప,(జనవిజయం): : పోసాని కృష్ణ మురళి బెయిల్‌పై విడుదలయ్యారు. వారంలో రెండు రోజులపాటు ఆయన సిఐడి కార్యాలయంలో సంతకం పెట్టాలి. విచారణకు సహకరించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇటువంటి తరుణంలో పోసాని కృష్ణ మురళి పై ఇప్పట్లో కేసులు ముగిసినట్లు కనిపించడం లేదు. రిమాండ్ నుంచి బయటకు వచ్చిన పోసాని కృష్ణమురళి నీరసంగా కనిపించారు. స్వాగతం పలికేందుకు వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను చూసి కన్నీటి పర్యాంతం అయ్యారు. తాజాగా ఆయన కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో తిరిగి యాక్టివ్ అయ్యేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాజకీయ మద్దతు లేనిదే తన కేసుల విషయంలో ఇబ్బందికర పరిస్థితులు తప్పవని భావిస్తున్నట్లు సమాచారం. అందుకే తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ కావడమే ఉత్తమం అన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పోసాని కృష్ణ మురళి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో స్పందించేవారు. ఒకానొక దశలో ఆయన సాక్షిలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక కార్యక్రమానికి హోస్ట్ గా కూడా సిద్ధపడ్డారు. అందుకు సంబంధించి ప్రమోషన్ వర్క్ కూడా జరిగింది. ఏమైందో ఏమో కానీ.. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని ప్రకటించారు. రాజకీయాలు మాట్లాడనని తేల్చి చెప్పారు. కూటమి ప్రభుత్వం నుంచి ఎదురయ్యే కేసులకు భయపడి పోసాని అలా చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే కూటమి ప్రభుత్వం ఆయనపై వెనక్కి తగ్గలేదు. వరుసగా కేసులు నమోదు చేసి ఉక్కిరిబిక్కిరి చేసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మద్దతు దారుడుగా ఉండేవారు పోసాని కృష్ణ మురళి. 2014 పార్టీ ఆవిర్భావం నుంచి జగన్ నాయకత్వాన్ని సమర్థించారు. అంతకుముందు ప్రజారాజ్యం పార్టీలో పని చేశారు పోసాని కృష్ణ మురళి. ఆ పార్టీ తరపున పోటీ చేశారు కూడా. పిఆర్పి కాంగ్రెస్ లో విలీనం అయిన తర్వాత రాజకీయాలనుంచి తప్పుకున్నారు. మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ వాయిస్ను బలంగా వినిపించారు. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పోసాని కృష్ణమురళికి ఏపీ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్గా అవకాశమిచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలామంది సినీ నటులు మద్దతు తెలిపినా పోసాని స్థాయిలో ఎవరికి కీలక పదవులు లభించలేదు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యర్థులపై విరుచుకుపడేవారు పోసాని కృష్ణ మురళి. ఎవరైనా వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తే తిప్పికొట్టేవారు. చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయి. అప్పట్లోనే ఇవి వివాదానికి దారి తీసాయి. కానీ వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడంతో పోసానిపై ఎటువంటి చర్యలు లేకుండా పోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోసాని చుట్టు కేసులు నడిచాయి. దాదాపు 26 రోజుల పాటు ఆయన రిమాండ్ ఖైదీగా ఉండి పోవాల్సి వచ్చింది. అయితే తాను దేనికి భయపడ్డారో అది జరిగిపోయింది. కేసులు కూడా ఎదురయ్యాయి. కనీసం ఈ కేసుల నుంచి బయటపడేందుకైనా రాజకీయ మద్దతు అవసరం. అందుకే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో రీ ఎంట్రీ ఇస్తారని తెలుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# బెట్టింగ్ యాప్స్ పై పోరాటం


హైదరాబాద్ : బెట్టింగ్ యాప్స్ కు ప్రమోషన్ చేశారని పలువురు సోషల్ మీడియా ఇన్ ఫ్లూ యన్సర్స్ పై తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిలో కొంతమంది విచారణకు హాజరయ్యారు.. మరి కొంతమంది విదేశాలకు వెళ్లిపోయారు. విచారణకు హాజరైన వారి స్టేట్మెంట్లను పోలీసులు రికార్డు చేసుకున్నారు.. సోషల్ మీడియా ఇన్ ఫ్లూ యన్సర్స్ చాలామంది తమ బెట్టింగ్ యాప్స్ కు అనవసరంగా ప్రమోషన్ చేసామని.. అందులో ఉన్న అసలు విషయాలు మాకు తెలియవని పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్స్ కు ప్రమోషన్ చేసిన వారిపై తెలంగాణ పోలీసుల కంటే ముందు సోషల్ మీడియా ఇన్ ఫ్లూ యన్సర్, టూరిస్ట్ వ్లాగర్ నా అన్వేషణ అన్వేష్ ఒక యుద్ధమే ప్రకటించాడు. బెట్టింగ్ యాప్స్ కు ప్రమోషన్ చేస్తున్న సోషల్ మీడియా ఇన్ ఫ్లూ యన్సర్స్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశాడు. ఆ మధ్య తెలంగాణ ప్రాంతానికి చెందిన భయ్యా సన్నీ యాదవ్ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన నా అన్వేషణ అన్వేష్.. సినీ కమెడియన్ అలీని కూడా వదలలేదు. అలీపై నా అన్వేషణ అన్వేష్ తీవ్రస్థాయిల విమర్శలు చేశాడు. వందల సినిమాలు చేసిన వ్యక్తి డబ్బుల కోసం కక్కుర్తి పడి ఇలాంటి యాప్స్ కు ప్రమోషన్ చేయడం ఏంటని మండిపడ్డాడు. ఇప్పుడు తాజాగా ఒకప్పటి టీవీ యాంకర్.. తీన్మార్ వార్తలు తో ప్రాచుర్యం పొందిన సావిత్రి అలియాస్ శివ జ్యోతి పై విమర్శలు చేయడం మొదలుపెట్టాడు..సావిత్రి అలియాస్ శివ జ్యోతి ఒకప్పుడు ఓ చానల్లో తీన్మార్ వార్తలకు ప్రజెంటర్ గా వ్యవహరించేది.. ఆ తర్వాత కొంతకాలానికి మరో ప్రముఖఛానల్లోకి వెళ్లిపోయింది. అనంతరం ఆమెకు సోషల్ మీడియాలో విపరీతమైన పాపులారిటీ వచ్చింది. బిగ్ బాస్ టీవీ షోలో కూడా పాల్గొంది. రీచ్ పెరగడంతో సోషల్ మీడియాలో కూడా విపరీతమైన హైప్ వచ్చింది. సొంతంగా వీడియోలు చేయడం మొదలుపెట్టింది. భర్త గంగూలితో కలిసి ఇతర ప్రాంతాలకు వెళ్ళిన వీడియోలను వ్లాగ్ రూపంలో తన యూట్యూబ్ ఛానల్ లో పోస్ట్ చేయడం మొదలుపెట్టింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ అలియాస్ బిఆర్ఎస్ కు అనుకూలంగా ప్రచారం చేసింది. గులాబీల జెండాలమ్మ అనే పాటకు డ్యాన్స్ చేసి సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. అయితే శివ జ్యోతి ఆ మధ్య కొన్ని బెట్టింగ్ యాప్స్ కు ప్రమోషన్ చేసింది. అయితే వాటినే ఇప్పుడు నా అన్వేషణ అన్వేష్ ప్రధానంగా ప్రశ్నిస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ కు ప్రమోషన్ చేయడం వల్లే శివ జ్యోతి భారీగా సంపాదించారని.. హైదరాబాదులో ఖరీదైన ప్లాట్ ఉందని.. మహ బూబ్ నగర్ జిల్లాలో హైవే పక్కన భూమి కూడా కొనుగోలు చేశారని.. నా అన్వేషణ అన్వేష తన వీడియోలో ఆరోపించాడు.. అయితే నా అన్వేషణ అన్వేష్ చేసిన వ్యాఖ్యలను కొంతమంది సమర్థిస్తుండగా.. మరి కొంతమంది విమర్శిస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ ను ప్రభుత్వం నిషేధిస్తే.. సోషల్ మీడియా ఇన్ ఫ్లూ యన్సర్స్ ఎందుకు ప్రచారం చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ముందుగా ప్రభుత్వాన్ని నిలదీయాలని.. ఆ తర్వాతే సోషల్ మీడియా ఇన్ ఫ్లూ యన్సర్స్ జోలికి రావాలని సూచిస్తున్నారు. " వారేం అన్యాయం చేయలేదు. ఇంకొకరిని మోసం చేయలేదు. తమకు ఉన్న పాపులారిటీ కి తగ్గట్టుగానే మాట్లాడారు. బెట్టింగ్ లో పాల్గొనాలని.. డబ్బు ఇందులో పెట్టాలని చెప్పలేదు కదా అని" నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

# బి.జె.పి ఛీఫ్ నియామకంలో ఆచి తూచి అడుగులు

హైదరాబాద్: వడపోత కంప్లీట్ అయింది. ప్రకటన రావడమే ఆలస్యం అన్నంత ప్రచారం జరిగింది. కానీ చివరి నిమిషంలో తెలంగాణ బీజేపీ చీఫ్ ఎంపిక సైలెంట్‌మోడ్‌లోకి వెళ్లిపోయింది. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి.. పొలిటికల్ పిక్చర్‌ను తలపిస్తోంది. ఆల్మోస్ట్ స్టేట్ చీఫ్ సెలెక్షన్ కంప్లీట్ అయిందని.. ఏ క్షణమైనా కాషాయ రథసారథి ఎంపికపై ప్రకటన రావొచ్చని అందరు అనుకున్నారు. కానీ చివరి నిమిషంలో ట్విస్ట్ ఇచ్చేలా ఉందట బీజేపీ అధిష్టానం. తెలంగాణ బీజేపీ చీఫ్ ఎంపిక విషయంలో ఆరునెలల పాటు సైలెంట్‌గా ఉండటమే బెటర్ ఆప్షన్‌గా భావిస్తుందట హైకమాండ్. తెలంగాణ బీజేపీ పెద్దల మౌనం వెనుక రీజన్ లేకపోలేదు. తెలంగాణ బీజేపీలో పాత నేతలు, కొత్తగా వచ్చిన నేతలు, దూకుడుగా వ్యవహరించే లీడర్స్.. ఇలా రకరకాల ఈక్వేషన్స్‌తో గ్రూపులు కట్టుకున్నారు.

పార్టీ అధ్యక్ష పదవి ఫలానా క్వాలిటీస్ ఉన్నవారికే ఇవ్వాలని ఓ వర్గం చెబుతుంటే.. క్వాలిటీస్ కాదు సీనియారిటీ ఇంపార్టెంట్ అన్నది మరోవర్గం వాదనట. ఇలా నేతలు ఎవరికి వారే తమ ప్రాధాన్యతల్ని కొత్త అధ్యక్ష పదవి మీద రుద్దే ప్రయత్నం చేయడంతో అసలేం జరుగుతోందో అర్థంకాని డైలమాలో పడిపోయిందట బీజేపీ హైకమాండ్. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒకరికి బీజేపీ అధ్యక్షుడి బాధ్యతల్ని అప్పగిస్తే.. మిగతా వర్గాలు అలకబూనడంతో పాటు అసంతృప్తి జ్వాలలు రగిల్చే అవకాశం ఉందని ఢిల్లీ పెద్దలు అనుమానిస్తున్నారట.

నిజానికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి నియామకంపై హైకమాండ్ ఆరు నెలలుగా కసరత్తు చేస్తోంది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, రామచందర్ రావు లాంటి నేతల పేర్లను పరిశీలించారు. ఎవరికి పార్టీ పగ్గాలు అప్పగిస్తే బీజేపీకి మైలేజ్ వస్తుందోనని బీజేపీ హైకమాండ్ అభిప్రాయసేకరణ కూడా చేసింది. ఈ క్రమంలో పార్టీలో ఎక్కడా



ఏకాభిప్రాయం లేదనే విషయం అధిష్టానికి స్పష్టంగా అర్థమైంది.

కొత్తగా వచ్చినవారికి చీఫ్ బాధ్యతలు ఇవ్వకూడదని పాతవర్గం ఇప్పటికే అల్టిమేటం జారిచేసిందని సమాచారం. మరోవైపు అధ్యక్ష పదవిని ఆశిస్తున్నావారు సైతం హైకమాండ్ ముందు రకరకాల కండీషన్స్ పెట్టారని తెలుస్తోంది.

గతంలో బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ పేరును ముందుగా పరిశీలించారట కమలం పెద్దలు. ఐతే తనకు తెలంగాణ పగ్గాలు అప్పగిస్తే కేంద్ర మంత్రిపదవిని తొలగించవద్దని బండి సంజయ్ కండీషన్ పెట్టారని కమలం ఆఫీస్‌లో టాక్ వినిపిస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒకరికి రెండు పదవులు ఇస్తే ఎలా అనే ఆలోచనలో పడిందట బీజేపీ హైకమాండ్. ఇక మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేరును సైతం పరిశీలించారు అధిష్టానం పెద్దలు. ఐతే తనను 2028 చివర్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల వరకు అధ్యక్షుడిగా కొనసాగించాలని ముందే చెప్పేశారట ఈటల. అందుకే ఈటల విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఇదే సమయంలో మరికొందరి పేర్లను తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి కోసం పరిశీలించినా మెజార్టీవర్గాల నుంచి ఏకాభిప్రాయం రాకపోవడంతో వెనక్కి తగ్గిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇలా తెలంగాణ బీజేపీ చీఫ్ ఎంపిక హైకమాండ్‌కు కత్తిమీద సాములా మారిందట. కాస్త టైమ్ తీసుకొని రథసారథిని ఎంపిక చేయడమే బెటర్ ఆప్షన్ అనుకుంటుందట బీజేపీ అధిష్టానం. మరికొన్నాళ్లు అధ్యక్షుడి ఎంపికను వాయిదా వేసి, ప్రస్తుతం బీజేపీ చీఫ్‌గా ఉన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డినే కొనసాగిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నారట బీజేపీ పెద్దలు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. గ్రేటర్ ఎన్నికలకు ముందు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిని నియమించాలనే డెసిషన్‌కు వచ్చినట్లు సమాచారం. ఐతే అప్పటిలోగా తెలంగాణ బీజేపీలో ఉన్న గ్రూపులు, వర్గాలను ఏకతాటిపైకి తీసుకురావాలనేది బీజేపీ పెద్దల ఆలోచనగా తెలుస్తోంది.

రేవంత్ సర్కారుపై

# మావోయిస్టుల ఆగ్రహం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా మారిన ఉస్మానియా యూనివర్సిటీ పోరాటాలు అందరికీ తెలిసిందే. ఓయూ కేంద్రంగా ఏళ్లతరబడి విద్యార్థులు చేసిన నిరసనలు ,ఆందోళనలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలనే కదిలించిన ఘటనలు తెలిసిందే. తెలంగాణ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంటూ అప్పట్లో చేసిన ప్రకటనతో ఓయూ ఒక్కసారిగా భగ్గుమంది. ఆ మంటలు ఏకంగా కేంద్ర నిర్ణయాన్ని పునరాలోలించే పరిస్థితికి తీసుకెళ్లింది. తెలంగాణ ఏర్పాటు చేయక తప్పని పరిస్థితికి తీసుకొచ్చింది ఓయూలోని ఆందోళనలు, నిరసనలు అంతలా చరిత్ర సృష్టించాయి. విద్యార్థి ఉద్యమాలకు పురిటిగడ్డగా నిలిచిన ఓయూలో ఇప్పుడు నిరసనలు,ఆందోళనలు చేయొద్దు అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు పెట్టడంపై ఇప్పటికే విద్యార్థి సంఘాలు భగ్గుమంటూ, ప్రతీ రోజూ నిరసనలు చేస్తుంటే.. తాజాగా మావోయిస్టు పార్టీ తీవ్రంగా స్పందించింది. ఓయూలో నిర్బంద ఆంక్షలు, హెచ్ సీయూలో భూముల వేలం ప్రక్రియ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై మావోయిస్టు పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. యూనివర్సిటీ భూములను కార్పొరేట్లకు అప్పజెప్పడానికి పథకాన్ని రూపొందించారని అందులో భాగంగానే యూనివర్సిటీలో ఘోరమైన నిరంకుశ పాలన కొనసాగుతున్నదని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో తాజాగా లేఖ విడుదల చేయడం కలకలం రేపుతోంది. పాలకుల విధానాల వలన గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఈరోజు విడుదల చేసిన లేఖలో మావోయిస్టు పార్టీ ధ్వజమెత్తింది. రాజ్యాంగం కల్పించిన చట్టబద్ధతను పట్టించుకోకుండా 400 ఎకరాల భూమిని అమ్మకానికి పెడుతున్నారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారి గొంతును నొక్కేస్తున్నారని మండిపడింది. నియంతృత్వ విధానాలను అమలు చేస్తూ కనీస పౌర స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించింది మావోయిస్టు పార్టీ. ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేయకూడదని ఈ నెల 13న ఓయూ రిజిస్ట్రార్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరించిన వారినీ కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించిందని, యూనివర్సిటీల్లో విద్యార్థుల పోరాటాలను అణిచివేయడానికి ఈ నిషేదాజ్ఞలు విధించారని ఆరోపించింది. ఓయూలో ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యల రాజ్యాంగ విరుద్ధం అని అప్రజాస్వామికం అని ధ్వజమెత్తింది. ఇలాంటి నిరంకుశత్వ చర్యలు దేశ భవిష్యత్తు ను నాశనం చేస్తాయని పేర్కొంది. విద్యను ప్రైవేట్ పరం చేసిన కార్పోరెట్లకు అప్పగించడానికే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని పేర్కొంది. ఓయూ యునివర్సిటీ విద్యార్థులు నిజాం మొదలు నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఇప్పటికీ పోరాడుతూనే ఉన్నారని దేశ రాజకీయాల్లో తెలంగాణ సామాజిక, రాజకీయ ఆర్థిక పోరాటాలలో క్రియాశీలంగా పాల్గొన్నారు. విద్యార్థులు కేవలం సమస్యలకే పరిమితం కాలేదు ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి అనేక త్యాగాలు చేశారని లేఖలో ప్రస్తావించింది. నేడు చాలా మంది అనుభవిస్తున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక ఫలాలన్నీ విద్యార్థులు చేసిన వీరోచిత పోరాటాల ఫలితమేనని, కానీ నేడు దోపిడీ పాలక వర్గాలు మాత్రం దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల ప్రయోజనాలను రక్షించడమే తమ ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారని ధ్వజమెత్తింది. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రభుత్వం విధించిన నిర్బంద ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. ఈ ఆంక్షలను ఎత్తివేసే వరకు విద్యార్థులంతా ఐక్యంగా పోరాడాలని ఈ లేఖలో మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

# అమరావతి, విశాఖలపై ఫోకస్

విజయవాడ: కూటమి సర్కార్ అమరావతితో పాటు విశాఖ అభివృద్ధిపై కూడా ఫోకస్ పెట్టిందా? విశాఖను ఆర్థిక రాజధానిగా మలిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందా? అమరావతి, విశాఖను కూటమి సర్కార్ రెండు కళ్లుగా భావిస్తుందా? ఈ రెండు నగరాల అభివృద్ధిని బ్యాలెన్సింగ్ చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందా? అమరావతి, వైజాగ్ డెవలెప్‌మెంట్ కోసం ప్రభుత్వం ఏం చేయబోతోంది? ఏపీకి అద్భుతమైన రాజధానిని నిర్మించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల మంత్రం జపించినా కూటమికే జై కట్టారు ప్రజలు. వైసీపీ గెలిస్తే విశాఖ రాజధాని అవుతుందని తెలిసినా ఆ ప్రాంత ప్రజలు కూటమికే పట్టం కట్టారు. ఐతే విశాఖ ప్రజలు ఎక్కడ నిరుత్సాహ పడిపోకుండా కూటమి సర్కార్ పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తుందట. కూటమి సర్కార్ పవర్‌లోకి వచ్చిన డే వన్ నుంచి అమరావతి నిర్మాణపనుల విషయంలో యాక్షన్ ప్లాన్‌ని రెడీ చేసుకొని ముందుకు వెళ్తోంది. అదే సమయంలో రాయలసీమ ఉత్తరాంధ్రాకు కూడా సమన్యాయం చేసేలా ప్రణాళికలను రూపొందించిందట కూటమి సర్కార్. అమరావతితో పాటు విశాఖకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోంది. విశాఖను ఐటీ హబ్‌గానూ పారిశ్రామిక కేంద్రంగానూ తీర్చిదిద్దడానికి ఉన్న అన్ని అవకాశాల్ని వాడుకుంటోంది. అలా విశాఖపట్నం వాసుల కలలను నెరవేర్చే పనిలో సక్సెస్ అవుతోందని లోకల్ టాక్. విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేశ్ ఈ ప్రాంతాన్ని ఐటీ హబ్‌గా మార్చుతామని ప్రకటించారు. విశాఖలో రానున్న ఐదేళ్లలో ఏకంగా 5 లక్షల ఐటీ ఉద్యోగాలు వచ్చేలా చూస్తున్నామని అన్నారు. అంతర్జాతీయ నగరంగా, ఆర్థిక రాజధానిగా విశాఖను తీర్చిదిద్దుతామన్నారు. విశాఖ ఏపీకే గొప్ప నగరంగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. విశాఖ గురించి గొప్పగా చెప్పడమే కాకుండా విశాఖకు కూటమి ప్రభుత్వం ఏమి చేసింది ఏమి చేయబోతోంది క్లారిటీ ఇచ్చేశారు లోకేశ్. ఇలా విశాఖ రాజసం కానీ రాజధాని హోదా కానీ ఎక్కడా తగ్గకుండా ప్రభుత్వం ముందుకు వెళ్లేలా కనిపిస్తోందని లోకల్ పీపుల్స్ చర్చించుకుంటున్నారట. మంత్రి లోకేశ్ మంత్రం విశాఖ అభివృద్ధిపై ఫోకస్ పెడితే.. సీఎం చంద్రబాబు అమరావతి గురించి ఎక్కువగా చెబుతుంటారు. ఏ సభకు వెళ్లినా. ఏ కార్యక్రమానికి వెళ్లినా? అమరావతి అద్భుతంగా తీర్చుదిద్దుతామని చంద్రబాబు ప్రస్తావిస్తారు. ఇలా రెండు నగరాలను డెవలప్‌చేసేలా కూటమి సర్కార్ దూసుకెళ్తోందని అన్నివర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ విషయంలో విశాఖ జనాలు కూడా ఫుల్ ఖుషీ అవుతున్నారట. ఏది ఏమైనా అమరావతి, విశాఖ రెండింటినీ కరెక్ట్‌గా బాలెన్స్ చేసుకుంటూ వెళ్తున్నారని బలమైన టాక్ జనాల్లోకి వెళ్లిపోయిందట.

6-12 april, 2025_Layout 1 4/22/2025 7:49 PM Page 5



# ఖాట్మండూలో రాచరికం వస్తుందా?

ఖట్మాండూ : ఒకప్పుడు ప్రపంచంలో ఏకైక హిందూ రాజ్యంగా ఉండిన నేపాల్‌లో ఇప్పుడు రాచరిక వ్యవస్థను పునరుద్ధరించాలన్న డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. రాచరికాన్ని పునరుద్ధరించాలని, తమ రాజు జ్ఞానేంద్ర షా తిరిగి రావాలని కోరుతూ నేపాల్ ప్రజలు కొన్నిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. రాజధాని ఖత్మాండూ వీధుల్లో వేలాది మంది రోడ్లపైకి వస్తున్నారు. కొన్నేళ్లుగా దేశంలో కొనసాగుతున్న రాజకీయ అస్థిర పరిస్థితులతో విసిగిపోయామని, తమకు మిగిలివున్న ఆప్షన్ 'రాజు తిరిగి రావడమే..' అని ఆందోళనకారులు నినదిస్తున్నారు.

నేపాల్‌లో దాదాపు రెండున్నర శతాబ్దాల పాటు కొనసాగిన రాచరిక పాలన 2008లో అంతమై.. ప్రజాస్వామ్య పాలన మొదలైంది. అనంతరం కాలంలో రాజకీయ అస్థిరత కారణంగా అనేక ప్రభుత్వాలు మారాయి. రాజు జ్ఞానేంద్ర దిగిపోయిన తర్వాత ప్రజలు 17 ఏళ్లలో 13 ప్రభుత్వాలను చూశారు. సంస్కరణలను అమలు చేయడానికి లేదా స్పష్టమైన దార్శనికత చూపేందుకు ఏ ప్రభుత్వం కూడా పదవీ కాలం చివరి వరకు కొనసాగలేదు. అవినీతి కుంభకోణాలు ఎక్కువయ్యాయి.రెండు శతాబ్దాలకు పైగా నేపాల్‌ను షా వంశీకులే పాలించారు. అయితే మాజీ మావోయిస్టు తిరుగుబాటుదారులతో కుదిరిన ఒ ప్పందం ఫలితంగా 2008లో నేపాల్‌ను హిందూ రాజ్యంనుంచి లౌకిక సమాఖ్య గణతంత్ర రాజ్యంగా మారుస్తూ ప్రత్యేకంగా ఎన్నికైన జాతీయ అసెంబ్లీ 239 ఏళ్ల రాజరిక వ్యవస్థను రద్దు చేసింది. 1996నుంచి 2006 మధ్య కాలంలో మావోయిస్టుల తిరుగుబాటు కారణంగా 17 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.రాజ్యాంగ వ్యవస్థ అయితే రద్దయింది కానీ అప్పటినుంచి నేపాల్‌లో రాజకీయ అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. బలహీన సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటు కావడం, కొన్ని నెలల్లోనే కూలిపోవడం పరిపాటిగా మారిపోయింది. 2008నుంచి ఇప్పటివరకు 13 ప్రభుత్వాలు మారాయి. అయినా రాజకీయ స్థిరత్వం ఏర్పడలేదు. మరోవైపు నేతల్లో రాజకీయ అవినీతి పెచ్చుమీరింది. దీంతో దేశ ప్రజలలో ఇప్పటి ప్రభుత్వాలపై ఆగ్రహం పెల్లుబుకుతోంది. ఫిబ్రవరి19న ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా చిట్టచివరి రాజు జ్ఞానేంద్ర షా ప్రజలనుంచి మద్దతు కోరడం ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది.దీని తర్వాత దేశంలో ఆందోళనలు హిం సాత్మకంగా మారాయి. తాజాగా శుక్రవారం జరిగిన హింసలో ఒక జర్నలిస్టు సహా ఇద్దరు మ-రణించగా పలువురు గాయపడ్డారు. ఆందోళనకారు లు దుకాణాలను దోచుకోవడంతో పాటు పలు వాహనాలకు నిప్పుపెట్టా రు. ఈ హింసాయుత ఘటనలకు జ్ఞానేంద్ర షానే కారణమని ఆరోపిస్తూ ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాని కేపీ ఓలి అత్యవసర మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు. ఖాట్మండులో చోటు చేసుకుంటున్న హింసాయు త ఘటనల కారణంగా త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు కూడా.నేపాలీ ప్రజలు తిరిగి రాజరిక వ్యవస్థను కోరుకోవడం వెనుక అనేక కారణాలున్నాయని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. 2001లో నేపాల్ రాజకుటుంబానికి చెందిన రాజు బీరేంద్ర, రాణి ఐశ్వర్య, ఆ కుటుంబానికి చెందిన మరో ఎనిమిది మంది దారుణంగా మూకుమ్మడి హత్యకు గురి కావడం ఆ దేశ చరిత్రలో పెద్ద మలుపు. యువరాజు దీపేంద్ర తాను కోరుకున్న యువతిని వివాహమాడడానికి కుటుంబం వ్యతిరేకత కాణంగా ఆగ్రహంతో అందరినీ చంపేసి తానూ ఆత్మహత్య చేసుకున్నారు. దాంతో జ్ఞానేంద్ర షా నేపాల్‌కు రాజయ్యారు. అయితే నేరుగా ప్రభుత్వంపై కంట్రో ల్ సాధించడం కోసం 2005లో పార్లమెంటును రద్దు చేసి ఎమర్జెన్సీ విధించడమే ఆయన అధికారచ్యుతికి దారి తీసింది.రాజరిక పాలనను ముగింపు పలకాలంటూ 2006 ఏప్రిల్‌లో ఏడు పార్టీల నేతృత్వంలో 'జన ఆందోళన' పేరుతో పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చెలరేగాయి. దీంతో ఒత్తిడికి తలొగ్గిన జ్ఞానేంద్ర పార్లమెంటును పునరుద్ధరించారు. 2008లో పుష్పకుమార్ దహల్ ప్రచండ నేతృత్వంలోని మాజీ మావోయిస్టు తిరుగుబాటుదారుల ఆధిక్యత ఉన్న కొత్తగా ఎన్నికైన రాజ్యాంగ అసెంబ్లీ రాచరి క వ్యవస్థ రద్దుకు అనుకూలంగా ఓటు వేయడంతో నేపాల్ ఫెడరల్ ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా ఏర్పడింది. రాజరిక వ్యవస్థలో నేపాల్ ప్రజలు వాస్తవానికి సుఖ సంతోషాలతోనే ఉండేవారని చెప్పాలి.పాలకులు భారత ప్రభుత్వంతో అత్యంత సన్నిహిత సంబంధాలను కలిగి ఉండేవారు. అయితే మా వోయిస్టులు తిరుగుబాటు చేయడం మొదలైనప్పటినుంచీ దేశం పేదరికంలోకి జారుకుంది. అప్పటివరకు పర్యాటకులకు స్వర్గధామంగా ఉండిన నేపాల్ క్రమంగా ఆర్థిక సంక్షోభంలోకి జారుకుంది. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వాలు ఇచ్చిన హామీలేవీ నెరవేరకపోవడంతో తిరిగి రాజరిక వ్యవస్థ రావాలన్న డిమాండ్ బలపడుతూ వచ్చింది. అదే ప్రస్తుత అశాంతికి దారితీసింది. జ్ఞానేంద్రకు పెరుగుతున్నమద్దతు తిరిగి రాచరిక వ్యవస్థ ఏర్పాటుకు దారి తీస్తుందా అన్న ప్రశ్నకు మాత్రం సరైన సమాధానం లేదు.

# హెచ్ సీ ఏ వర్సెస్ ఎస్ ఆర్ హెచ్

హైదరాబాద్ : హెచ్ సీఏ వర్సెస్ ఎస్ ఆర్ హెచ్. ఇది క్రికెట్ అభిమానులకు కష్టంగా ఉండొచ్చు కానీ రియాల్టీలో ఇదే జరుగుతోంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్? సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య ఫ్రీపాస్ విషయంలో పెద్ద ఎత్తున వివాదాలు చోటు చేసుకుంటున్నాయి.

అసలు వివాదమేంటో చూస్తే.. హెచ్ సీఏ అధికారులు ఉచిత టికెట్ల కోసం బెదిరింపులు, ఒత్తిడి చేస్తున్నారని, గత రెండేళ్లుగా ఈ సమస్యలు కొనసాగుతున్నాయని ఎస్ ఆర్ హెచ్ ఆరోపిస్తోంది. మార్చిన 27న కూడా గొడవ జరిగినట్లు తెలుస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా హెచ్ సీఏ ఫ్రీపాస్‌ల విషయంలో గొడవ చేసిందని.. మ్యాచ్‌కు ముందు ఒక కార్పొరేట్ బాక్స్‌ను హెచ్ సీఏతాళం వేసిందని, అదనపు టికెట్లు ఇవ్వకపోతే తెరవమని బెదిరించిందని ఎస్ ఆర్ హెచ్ ఆరోపిస్తోంది. ఇలాంటి గొడవలు కంటిన్యూ అయితే.. తమ హోమ్‌గ్రౌండ్‌ను వేరే వేదికకు తరలిస్తామని ఎస్ ఆర్ హెచ్ వార్నింగ్ ఇస్తోంది. ఈమేరకు హెచ్ సీఏ కు మెయి-ల్ కూడా పంపినట్లు సమాచారం. అలాగే తెలంగాణ ప్రభుత్వానికి, బీసీసీఐకు కూడా ఫిర్యాదు చేస్తామని ఆ మెయి-ల్‌లో ఎస్ ఆర్ హెచ్ హెచ్చరించినట్లు వార్తలొచ్చాయి.కానీ హెచ్ సీఏ వెర్షన్ మరోలా ఉంది. ఫ్రీపాస్‌ల విషయంలో తామెవరినీ బెదిరించలేదని, ఎస్ ఆర్ హెచ్ నుంచి ఎలాంటి అధికారిక ఈ-మెయిల్ రాలేదని, సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదంటోంది. అసలు ఈ-మెయిల్ నిజంగా లీక్ అయిందా? లేక ఎస్ ఆర్ హెచ్ దీన్ని బహిర్గతం చేసి హెచ్ సీఏ పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేసిందా? అన్న ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. అయితే ఇవన్నీ ఫేక్ మెయిల్స్ అన్నది హెచ్ సీఏ వాదన. మామూలుగా హెచ్ సీఏ తో ఒప్పందం ప్రకారం స్టేడియం సామర్థ్యంలో 10%.. అంటే సుమారు 3,900 టికెట్లు ఉచితంగా ఇస్తున్నారు. ఇందులో ఈ12ం కార్పొరేట్ బాక్స్‌లో 50 సీట్లు ఉన్నాయి. కానీ ఈ సీజన్‌లో ఆ బాక్స్ సామర్థ్యం 30 సీట్లేనని, అదనంగా 20 సీట్లు మరో బాక్స్‌లో ఇవ్వాలని కోరింది.ఎస్ ఆర్ హెచ్ ఈ అదనపు డిమాండ్‌ను నిరాకరించడంతో, హెచ్ సీఏ మార్చి 27న లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్ రోజున ఈ3 బాక్స్‌ను తాళం వేసిందని, అదనపు టికెట్లు ఇవ్వకపోతే తెరవమని బెదిరించిందని ఎస్ ఆర్ హెచ్ ఆరోపిస్తోంది. గత రెండేళ్లుగా ఇలాంటి సమస్యలు కొనసాగుతున్నాయని, ఇక సహించలేమని ఎస్ ఆర్ హెచ్. హెచ్ సీఏ ట్రెజరీకి మెయిల్ చేసిందన్న వార్తలు వచ్చాయి.నిజంగా ఎస్ ఆర్ హెచ్ ఆరోపణల్లో వాస్తముండి..హెచ్ సీఏ టార్చర్ పెడుతుంటే.. ఎస్ ఆర్ హెచ్ హోమ్‌గ్రౌండ్‌ను వీడే అవకాశం ఉంది. ఇదే జరిగితే.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు పెద్ద దెబ్బ. ఇది కేవలం క్రికెట్ సమస్యగానే కాదు..హైదరాబాద్ ఇమేజ్‌పైనా ప్రభావం ఉండే అవకాశం ఉంది. ఎఖఒ జట్టును కోల్పోవడం అంటే అటు ప్రభుత్వానికి.. హెచ్ సీఏ సామర్థ్యానికి పెద్ద తలవొంపే. ఎ హబ్‌గా పేరున్న హైదరాబాద్‌కు ఇది బిగ్ బ్లండర్ మిస్టేక్. ఎస్ ఆర్ హెచ్ ఈ విషయాన్ని బీసీసీఐ తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పింది. బోర్డు జోక్యం చేసుకుంటే, హెచ్ సీఏ పై కఠిన చర్యలు తీసుకోవచ్చు. లేకపోతే ఎస్ ఆర్ హెచ్ కి తాత్కాలికంగా విశాఖపట్నం వంటి వేరే ఎ ే ది క ్ న ం కేటాయించవచ్చు. అందుకే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎస్ ఆర్ హెచ్ కు మద్దతుగాహెచ్ సీఏ కు వార్నింగ్ ఇచ్చారు. ఫ్రీ పాసుల విషయంలో సన్ రైజర్స్‌ను ఇబ్బంది పెడితే.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్ సీఏ పై వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ సర్కార్ సీరియస్ కావడంతో.. హెచ్ సీఏ ఓ సుదీర్ఘ వివరణ ఇచ్చింది. హెచ్ సీఏ పై గతంలోనూ అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. విద్యుత్ బిల్లుల విషయంలోనూ వివాదాల్లో చిక్కుకుంది. ఇప్పుడు ఫ్రీపాస్ వివాదం. మరి ఈ వివాదం ఎటు తిరిగి ఎటు పోతుందోనన్న ఆందోళన అటు క్రికెట్ అభిమానుల్లో కనిపిస్తోంది. మరి ఏం జరుగుతుంది? ఇష్యూ చినిగి చాటవకుండా..నాలుగు గోడల మధ్యే పరిష్కారమవుతుందా? లేదా? అన్నది వేచి చూడాలి.

# జూన్ వరకు భగభగలే

హైదరాబాద్ : ఎయిర్ ఫ్రయర్.. 'నూనె'తో పనిలేకుండా ఫ్రై చేసి పెట్టే విద్యుత్ పరికరం. ఆరోగ్యం కోసం ఈ మధ్య చాలా మంది దీన్ని వినియోగిస్తున్నారు. ఇది మనం నిర్ణయించిన ఉష్ణోగ్రతలో వేడి గాలిని ఉత్పత్తి చేస్తుంది. ఆ గాలితో లోపలి వస్తువులు వేగిపోతాయి. అంటే మరిగే నూనె అవసరం లేకుండానే కూరగాయలైనా.. మాంసాహారమైనా 'ఫ్రై' అయిపోతుందన్నమాట.ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకంటే.. భారతదేశం ఓ 2-3 నెలల పాటు ఎయిర్ ఫ్రయర్ గా మారిపోనుంది. వినడానికి అతిశయోక్తిలా ఉన్నా.. వాతావరణ శాఖ హెచ్చరికలు అచ్చంగా అలాగే ఉన్నాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో భారత్‌లోని దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. తెల్లటి మంచు దుప్పటి కప్పుకునే హిమగిరులు సైతం కరిగి పచ్చని పచ్చిక బయటపడుతుంది. ఇది ప్రతి వేసవిలో సర్వ సాధారణమే. కానీ ఈ ఏడాది అలా కాదు అంటున్నారు భారత వాతావరణ శాఖ అధికారులు. ఈ వేసవిలో ముఖ్యంగా ఏప్రిల్, జూన్ మధ్య కాలంలో దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో సాధారణం కంటే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరిస్తున్నారు. దేశంలోని పశ్చిమ, తూర్పు ప్రాంతాల్లో కొన్ని చోట్ల మాత్రం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ చీఫ్ మృత్యుంజయ్ మోహపాత్ర వెల్లడించారు.ఏప్రిల్,జూన్ మధ్య కాలంలో హీట్ వేవ్ (వేడి గాలులు) పరిస్థితులు సాధారణం కంటే ఎక్కువ సంఖ్యలో తలెత్తుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ పరిస్థితి దేశంలోని ఉత్తర, తూర్పు, మధ్య ప్రాంతాలతో పాటు వాయువ్యంలో మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. వేసవిలో వడగాలులు సహజమే. అయితే వడగాలులు తలెత్తే పరిస్థితులు రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నదే ఆందోళన కలిగించే అంశం.హీట్ వేవ్ పరిస్థితుల కారణంగా తీవ్రంగా ప్రభావితమయ్యే రాష్ట్రాల్లో రెండు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కూడా ఉన్నాయి. ఈ జాబితాలో తెలుగు రాష్ట్రాలతో పాటు రాజస్థాన్, గుజరాత్, హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, చత్తీస్‌గఢ్తో పాటు ఉత్తర కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు, తమిళనాడు ఉన్నాయి. ఏప్రిల్ నెలలో పూర్తి దక్షిణాన ఉన్న కొన్ని ప్రాంతాలు, వాయువ్య దిశలో ఉన్న కొన్ని ప్రాంతాలు మినహా దేశమంతటా సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఎఓఆ హెచ్చరిస్తోంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు సైతం సగటు కంటే ఎక్కువగా ఉంటాయని వెల్లడించింది.వేసవిలో ఎయిర్ ఫ్రయర్‌ను తలపించనున్న భారతదేశంలో విద్యుత్ డిమాండ్ కూడా పెరగనుంది. గత ఏడాది దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ గరిష్ట స్థాయి మార్కు 250 గిగావాట్లను దాటింది. గత ఏడాది మే 30న ఇది సంభవించింది. అంతకు ముందు ఏడాదితో పోల్చితే ఇది 6.3% అధికం. ఈ లెక్కన ఈ ఏడాది ఇంతకు మించిన విద్యుత్ డిమాండ్ ఏర్పడనుంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోక తప్పదని వాతావరణ శాఖ హెచ్చరికలను బట్టి అర్థమవుతోంది. ఓవైపు వాతావరణ శాఖ వేడి గాలులు, గరిష్ట ఉష్ణోగ్రతల గురించి హెచ్చరిస్తుంటే మరోవైపు సెంట్రల్ వాటర్ కమిషన్ దేశవ్యాప్తంగా జలాశయాల్లో నీటి నిల్వలపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. అసలు సిసలు వేసవి మొదలుకాక ముందే దేశంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు నిండుకునే పరిస్థితికి చేరుకున్నాయి. దేశంలోని 150 ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు వాటి మొత్తం సామర్థ్యంలో 45%కు పడిపోయాయి. మునుపటి ఏడాది కంటే చాలా దిగువకు నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. రుతు పవనాలు ప్రారంభమై దేశవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిస్తే తప్ప రిజర్వాయర్లలోకి కొత్తగా నీరు వచ్చి చేరే పరిస్థితులు లేవు. హిమాలయ నదుల్లో వేసవిలో మంచు కరగడం ద్వారా నీటి లభ్యత ఏమాత్రం తగ్గకుండా కొనసాగుతుంది. కానీ మధ్య భారతం నుంచి దక్షిణాది వరకు ఉన్న నదులన్నీ వర్షాధారమైనవే. వాటిని ఆధారం చేసుకుని నిర్మించిన జలాశయాల్లో నీటి నిల్వలు పెంచే అవకాశం లేదు.దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం ప్రక్రియ పూర్తయి ఉంటే ఈ పరిస్థితిని నివారించే ఆస్కారం ఉండేదని నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు దక్షిణాది నగరాల్లో నీటి కొరత సమస్య తప్పేలా లేదు.

# ఎక్స్ ను అమ్మేసిన మస్క్

న్యూయార్క్ : ఎలాన్ మస్క్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌ను అమ్మేశారు. తను ఇటీవలే స్థాపించిన కృతిమమేధ అంకుర సంస్థ ఎక్స్ ఏఐకి 33 బిలియన్ అమెరికన్ డాలర్ల(రూ. 2.80 లక్షల కోట్లు)కు విక్రయించినట్లు పేర్కొన్నారు.2022లో ట్విట్టర్‌ను కొనుగోలు చేసి దానిని ఎక్స్‌గా పేరు మార్చారు.అప్పుడు 44 బిలియన్ అమెరికన్ డాలర్లకు కొనుగోలు చేయగా ఇప్పుడు 33 బిలియన్ అమెరికన్ డాలర్లకు అమ్మేశారు. ఎక్స్‌ను కూడా సొంతం చేసుకోవడంతో ఎక్స్‌ఏఐ తాజా విలువ 80 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుందని మస్క్ ప్రకటించారు. ఈ అమ్మకం మొత్తం స్టాక్స్ రూపంలో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఎక్స్ విలువ 33 బిలియన్ అమెరికన్ డాలర్లు (45 బిలియన్ అమెరికన్ డాలర్లు+12 బిలియన్ అమెరికన్ డాలర్ల అప్పులు)గా అంచనా వేసినట్లు తెలిపారు. ఎక్స్ ప్లాట్‌ఫాంకు ప్రపంచవ్యాప్తంగా 600 మిలియన్ల యాక్టివ్ యూజర్లు ఉన్నారని ఆయన వెల్లడించారు. 'ఎక్స్ ఏఐ, ఎక్స్‌ల భవిష్యత్ ఒకదానితో ఒకటి ముడిపడి ఉంది.ఈ రోజు మేము అధికారికంగా డేటా, మోడల్స్, కంప్యూట్, డిస్ట్రిబ్యూషన్, ప్రతిభను అనుసంధానం చేసేందుకు ముందుడుగు వేస్తున్నాం. ఇది ప్రపంచాన్ని ప్రతిబింబించడమే కాకుండా మానవ పురోగతిని మరింత వేగవంతం చేసేలా సమర్థవంతమైన వేదికను నిర్మించేందుకు మాకు వీలు కల్పిస్తుంది' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రెండేండ్ల కింద స్థాపించిన కృతిమమేధ అంకురసంస్థ ఎక్స్ ఏఐ శరవేగంగా దూసుకుపోతోందని అభిప్రాయ పడ్డారు. 'కొద్ది కాలంలోనే ప్రపంచంలో ఎంతో సామర్థ్యం ఉన్న కంపెనీల జాబితాలోకి ఎక్స్ ఏఐ చేరింది. ఈ రెండింటి కలయిక వల్ల యూజర్లు మెరుగైన అనుభవం పొందనున్నారని తెలిపారు. ఎక్స్‌ఏఐ 2025 ఫిబ్రవరిలో ఏఐ చాట్‌బాట్ గ్రోక్ 3ని విడుదల చేసింది. చాట్‌జీపీటీ, డీప్ సీక్ వంటి రకరకాల ఏఐ టూల్స్‌కు ఇది పోటీనిస్తుందని అంతా భావిస్తున్నారు.

# బెజవాడలో మెట్రో అడుగులు

విజయవాడ : విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి కీలక అప్ డేట్ వచ్చింది. విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు అధికారులు సిద్ధమవుతున్నారు. మరో వారం రోజుల్లో విజయవాడ మెట్రో ప్రాజెక్టు భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు సమాచారం.

విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు తొలిదశలో కారిడార్ 1ఏ, కారిడార్ 1బీ నిర్మాణం చేపట్టనున్నారు. కారిడార్ 1ఏ కింద గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకూ మెట్రో నిర్మించనున్నారు. కారిడార్ 1బీ కింద పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పెనమలూరు వరకూ మెట్రో రైల్ ప్రాజెక్టు నిర్మించనున్నారు. విజయవాడ మెట్రో ప్రాజెక్టు మొదటి దశలో 38.40 కి.మీ మేర మెట్రో నిర్మాణం జరగనుంది. ఇందుకోసం రూ.11,009 కోట్లు ఖర్చవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. భూసేకరణకు గానూ రూ.1,152 కోట్లు ఖర్చవుతాయని అంచనా.

అయితే భూసేకరణకు అయ్యే మొత్తాన్ని ఏపీ ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది.విజయవాడ మెట్రో ప్రాజెక్టులో భాగంగా చేపట్టబోయే కారిడార్ 1ఎ, కారిడార్ 1బి నిర్మాణానికి సుమారుగా 82.66 ఎకరాల భూమి అవసరమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కృష్ణా జిల్లాలో 70.95 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 11.71 ఎకరాలను సేకరించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే ఈ 82 ఎకరాల భూసేకరణకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయాలని యోచిస్తున్నారు.

అయితే మెట్రో లైన్ కోసం సేకరించే ఈ 82.66 ఎకరాల భూమిలో.. రైల్వే వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన స్థలం 1.03 ఎకరాల వరకూ ఉంది. అలాగే ఏపీ ప్రభుత్వానికి 4.86 ఎకరాల భూమి ఉంది. మిగతా 76.77 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తులది.. వీరి నుంచి భూమిని సేకరించాల్సి ఉందిమరోవైపు విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి రామవరప్పాడు చౌరస్తా నుంచి గన్నవరం వరకు జాతీయ రహదారి మీదుగా మెట్రో లైన్ రానుందో?



ఈ రూట్లో ఫ్లైఓవర్‌లు కూడా నిర్మిస్తున్నందున.. ఒక ఫ్లైఓవర్‌పైన మరో ఫ్లైఓవర్.. దానిపైన మెట్రో ఇలా డబుల్ లైన్‌లో రానున్నాయి. ఈ నేపథ్యంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, మెట్రో కలిసి ఒకేసారి ప్లాన్ రూపొందించనున్నాయి. మరోవైపు విశాఖ, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులను ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ మోడల్‌లో చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టు డిజైన్ల తయారీకి గుజరాత్, చెన్నై మెట్రో ప్రాజెక్టుల్లో అనుభవం ఉన్న రిటైర్డ్ ఆఫీసర్ల సేవలు వినియోగించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.

0838 సొరంగాలు.. 927 వంతెనలు దాటుకుంటూ..

# వందే భారత్ ట్రైన్

శ్రీనగర్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏప్రిల్ 19న కాత్రా నుండి కాశ్మీర్‌కు మొదటి వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు. దీనితో 272 కి.మీ. పొడవైన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ ప్రాజెక్ట్ పూర్తవుతుంది. జమ్మూ రైల్వే స్టేషన్‌లో మరమ్మత్తు, పునరుద్ధరణ పనులు జరుగుతున్నందున జమ్మూ-కాత్రా-శ్రీనగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ మొదట కాత్రా నుండి నడుస్తుంది. రైలు లింక్ ప్రాజెక్ట్ గత నెలలో పూర్తయిందని అధికారులు తెలిపారు. జనవరిలో కాత్రా- కాశ్మీర్ మధ్య రైలు సేవను రైల్వే భద్రతా కమిషనర్ ఆమోదించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ జమ్మూ అండ్ శ్రీనగర్ మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, ఈ ప్రాంతానికి ఆధునిక, సమర్థవంతమైన రైలు సేవలను అందిస్తుందని అధికారులు చెబుతున్నారు.దీని గురించి కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏప్రిల్ 19న ఉధంపూర్ చేరుకుంటారు. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెనను ఆయన సందర్శించి ప్రారంభిస్తారు. దీని తర్వాత ఆయన కాట్రా నుండి వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తారని అన్నారు. దీనితో కాశ్మీర్‌కు ప్రత్యక్ష రైలు కనెక్టివిటీ కోసం చాలా కాలంగా ఉన్న డిమాండ్ నెరవేరుతుంది. ప్రస్తుతం లోయలోని సంగల్దాన్, బారాముల్లా మధ్య, అలాగే కాట్రా నుండి దేశవ్యాప్తంగా ఉన్న గమ్యస్థానాలకు మాత్రమే రైలు సేవలు నడుస్తున్నాయని తెలిపారు.కాశ్మీర్‌ను రైలు ద్వారా అనుసంధానించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు 1997లో ప్రారంభమైందని అధికారులు తెలిపారు. కానీ భౌగోళిక, భౌగోళిక, వాతావరణ సంబంధిత సవాళ్ల కారణంగా దీని పూర్తి ఆలస్యం అయింది. ఈ ప్రాజెక్టులో మొత్తం 119 కి.మీల పొడువునా 38 సొరంగాలు ఉండగా, వీటిలో 12.75 కి.మీల మేర నిర్మించిన టీ-49 సొరంగం అత్యంత పొడవైనది. అలాగే, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో 927 వంతెనలు సైతం ఉన్నాయి. వీటిలో చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన కూడా ఉంది. దీని ఎత్తు 359 మీటర్లు కాగా, పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 35 మీటర్లు ఎక్కువ.

6-12 april, 2025_Layout 1 4/22/2025 7:49 PM Page 6



# సుహాసినికే టీడీపీ పగ్గాలు



హైదరాబాద్ : తెలుగుదేశం పార్టీని మరో 50 ఏళ్ల పాటు ముందుకు తీసుకెళ్లాలి అన్నది చంద్రబాబుప్లాన్. తన వయసు రీత్యా ఆయన భవిష్యత్తు ప్రణాళిక వేస్తున్నారు. నారా లోకేష్ ను ప్రమోట్ చేస్తూనే.. నందమూరి కుటుంబాన్ని కొలుపుకేల్లాలని భావిస్తున్నారు. తద్వారా తెలుగుదేశం పార్టీ భవిష్యత్తును తీర్చిదిద్దే పనిలో పడ్డారు చంద్రబాబు ఏపీ రాజకీయాల్లో నందమూరి కుటుంబానికి ప్రత్యేక స్థానం. అటు వెండితెరను సైతం ఏలింది ఆ కుటుంబం. అయితే ఇప్పుడు నందమూరి కుటుంబం నుంచి సరైన రాజకీయ ప్రాతినిధ్యం లేదు. అదే ఆ కుటుంబ అభిమానులకు లోటు. తెలుగుదేశం పార్టీలో నందమూరి కుటుంబం ప్రాతినిధ్యం పెరగాలన్నది వారి నుంచి వస్తున్న డిమాండ్. అయితే దీనిని పరిగణలోకి తీసుకున్నారట చంద్రబాబు. అందుకే నందమూరి కుటుంబానికి కీలక బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. మరోవైపు నందమూరి కుటుంబంలో ఉన్న విభేదాలు ఒక్కొక్కటి సమసి పోతుండగా.. తామంతా ఒక్కటేనని చెప్పేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొన్నటికి మొన్న నారా లోకేష్ జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీ తో హల్చల్ చేశారు. అది మరవక ముందే నందమూరి కళ్యాణ్ రామ్ టిడిపి జెండా చేత పట్టుకొని సందడి చేశారు. తద్వారా విభేదాలు అన్నవి ఊహాగానాలే తప్ప.. నిజం కాదని తేల్చి చెప్పే ప్రయత్నం చేశారు. గత కొద్దిరోజులుగా నందమూరి యువ హీరోలు జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ లు తెలుగుదేశం పార్టీకి దూరంగా ఉన్నారు. అదే సమయంలో నందమూరి బాలకృష్ణ సైతం వారిని పట్టించుకున్న దాఖలాలు లేవు. వారి ప్రస్తావన కూడా తేవడానికి ఆయన ఇష్టపడడం లేదు. విభేదాలు తారాస్థాయికి చేరిపోయాయి అన్నది పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే బాలకృష్ణకు పద్మ అవార్డు లభించింది. బాల బాబాయ్ అంటూ జూనియర్ ఎన్టీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కళ్యాణ్ రామ్ అయితే తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీని మరో 50 ఏళ్ల పాటు ముందుకు తీసుకెళ్లాలి అన్నది చంద్రబాబు ప్లాన్. తన వయసు రీత్యా ఆయన భవిష్యత్తు ప్రణాళిక వేస్తున్నారు. నారా లోకేష్ ను ప్రమోట్ చేస్తూనే.. నందమూరి కుటుంబాన్ని కొలుపుకేల్లాలని భావిస్తున్నారు. తద్వారా తెలుగుదేశం పార్టీ భవిష్యత్తును తీర్చిదిద్దే పనిలో పడ్డారు చంద్రబాబు. ప్రస్తుతం సినిమాల్లో బిజీగా ఉన్నారు జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్. వారిని ఇబ్బంది కలిగించకుండా నందమూరి కుటుంబాన్ని ఉపయోగించుకోవాలన్నదే చంద్రబాబు వ్యూహంగా తెలుస్తోంది.

తెలంగాణలో టిడిపిని బలోపేతం చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. 2023 ఎన్నికలకు ముందు తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కాసాని జ్ఞానేశ్వర్ ఉండేవారు. అయితే ఆ ఎన్నికల్లో టిడిపి పోటీ చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆయన పార్టీ నుంచి బయటికి వెళ్లిపోయారు. అప్పటినుంచి తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు పదవి ఖాళీగా ఉంది. ఆ పదవిని నందమూరి కుటుంబానికి ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని కి బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఆమె 2018 ఎన్నికల్లో టిడిపి తరఫున కూకట్పల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. పార్టీలో చాలా యాక్టివ్ గా ఉంటూ వచ్చారు. అందుకే ఆమెకు బాధ్యతలు అప్పగించడం ద్వారా నందమూరి కుటుంబాన్ని కలుపుతున్నట్లు సంకేతాలు ఇవ్వనున్నారట చంద్రబాబు. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# మోడీ రిటైర్మెంట్ చర్చ-రచ్చ



ప్రధాని మోడీ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయ సందర్శన దేశ రాజకీయాల్లో చర్చనీయాశంగా మారింది. బీజేపీ రాజ్యాంగం ప్రకారం 2025 సెప్టెంబర్లో మోడీ ప్రధాని పదవి నుంచి దిగిపోవచ్చని.. ఈ విషయం చెప్పేందుకు ఆయన ఆర్ఎస్ఎస్ పెద్దలను కలిశారని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలు పొలిటికల్ సర్కిల్స్?లో కొత్త చర్చకు తెరలేపాయి. అంతేకాకుండా ఆర్ఎస్ఎస్ మోడీ వారసుడిని ఎంపిక చేసే పనిలో నిమగ్నమైందన్న రౌత్ కామెంట్స్? బీజేపీ వర్గా?ల్లోనూ హాట్ టాపిక్?గా మారాయి. నిజంగానే మోడీ ప్రత్యామ్నాయానికి ఆర్ఎస్ఎస్ కసరత్తు మొదలుపెట్టింది..? అదే నిజం అయితే ఎవరికీ అవకాశం దక్కుతుంది..? అన్న చర్చలు ఊపందుకున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ రిటైర్ అవుతున్నారని ఉద్ధవ్ బాల్ థాకరే నేతృత్వంలోని శివసేన పార్టీ నేత సంజయ్ రౌత్ అన్నారు. “మోదీ సెప్టెంబర్ నెలలో రిటైర్ అవుతున్నారు. అందుకే ఆయన ఈ 10-11 ఏళ్లలో ఎన్నడూ లేనిది కొత్తగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. అక్కడే తన రిటైర్మెంట్ ప్లానింగ్ కోసం అప్లికేషన్ పెట్టుకున్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను కలిసి టాటా బైబై చెప్పడానికే మోదీ అక్కడికి వెళ్లారు” అని సంజయ్ అభిప్రాయపడ్డారు. అంతేకాదు... దేశ నాయకత్వంలో, బీజేపి నాయకత్వంలోనూ ఆర్ఎస్ఎస్ కూడా మార్పును కోరుకుంటోంది అని మరో బాంబు పేల్చారు ప్రధానిగా మోదీ సమయం అయిపోయిందని సంజయ్ రౌత్ అన్నారు. ఆర్ఎస్-ఎస్ కూడా కేంద్రంలో, బీజేపిలో నాయకత్వ మార్పును కోరుకోవడమే అందుకు కారణంగా ఆయన చెప్పారు. మోదీ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం పర్యటన గురించి సోమవారం ముంబైలో మీడియాతో మాట్లాడుతూ సంజయ్ రౌత్ ఈ వ్యాఖ్యలు చేశారు. అప్పుడు వాజ్‌పేయ్... ఇప్పుడు మోదీ ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నాగపూర్ పర్యటనకు వచ్చారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు కేశవ్ బలిరాం హెగ్డేవార్ జ్ఞాపకార్థం నిర్మించిన హెగ్డేవార్ స్మృతి మందిర్‌కు వెళ్లి ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఆ సంస్థ అధినేత మోహన్ భగవత్‌ను కలిసి కాసేపు ముచ్చటించారు. ఇలా ప్రధాని స్థాయిలో ఉన్న వారు ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం సందర్శించడం ఇది రెండోసారి. 2000 సంవత్సరంలో అప్పటి ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి కూడా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఇక్కడికి వచ్చారు. ఇప్పుడు మోదీ కూడా రావడాన్ని ఆయన రిటైర్మెంట్ ప్లాన్స్‌కు ముడిపెడుతూ సంజయ్ రౌత్ ఈ వ్యాఖ్యలు చేశారు. సంజయ్ రౌత్ చేసిన ఈ వ్యాఖ్యలపై ప్రధాని మోదీతో పాటు బీజేపి అధినాయకత్వం ఎలా స్పందిస్తుందనేదే ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఆర్ఎస్ఎస్, బీజేపి స్నేహం ఆర్ఎస్ఎస్ బీజేపీకి అనుబంధ సంస్థగా పనిచేస్తోన్న సంగతి తెలిసిందే. బీజేపిలో పెద్ద పెద్ద నాయకులుగా ఎదిగిన వారిలో చాలామంది నాయకులు ఒకప్పుడు ఆర్ఎస్ఎస్‌లో చేరి అక్కడ అంచెలంచెలుగా ఎదిగిన వారే. ముఖ్యంగా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపి గెలుపులో ఆర్ఎస్ఎస్ పాత్ర ఎంతో కీలక పాత్ర పోషించిందని బీజేపి నాయకులే అంగీకరించారు. అంతేకాదు... బీజేపి నాయకత్వంపై ఆర్ఎస్ఎస్ ప్రభావం ఉంటుంది అనే విమర్శలు కూడా ఉన్నాయి. తాజాగా సంజయ్ రౌత్ వ్యాఖ్యలు కూడా అందులోంచి వచ్చినవే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మోడీ తర్వాత ప్రధాని రేసులో యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్ ముందు వరుసలో ఉన్నట్లు కమలం పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో ప్రధాని పదవి.. తన రాజకీయ భవిస్యత్?పై సీఎం యోగి ఆదిత్య నాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు పార్టీ హై కమాండ్ నుంచి అనుకూల సంకేతాలు ఉన్నాయా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. రాజకీయాలు నాకు పూర్తి కాల ఉద్యోగం కాదని.. నేను ఒక యోగినని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “ప్రస్తుతం నేను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిని. పార్టీ హైకమాండ్ నన్ను ఉత్తరప్రదేశ్ ప్రజల కోసం ఇక్కడ ఉంచింది. రాజకీయాలు నాకు పూర్తి ఉద్యోగం కాదు. ప్రస్తుతం నేను ఇక్కడ పనిచేస్తున్నా. దీనికి కూడా ఒక కాలపరిమితి ఉంటుంది. కానీ వాస్తవానికి నేను ఒక యోగిని” అని పేర్కొన్నారు. అలాగే బీజేపీ హై కమాండ్?తో తనకు విభేదాలు ఉన్నట్లు జరుగుతోన్న ప్రచారంపైన యోగి క్లారిటీ ఇచ్చారు. బీజేపీ పెద్దలతో తనకు ఎలాంటి విభేదాలు లేవని.. అదంతా ఫేక్ ప్రచారమని కొట్టిపారేశారు. పార్టీ అధిష్టానమే నాకు సీఎం పదవి ఇచ్చింది. అలాంటప్పుడు కేంద్ర నాయకులతో నాకు విభేదాలు ఉంటే నేను ఇక్కడ సీఎం పదవిలో ఎలా ఉంటానని ప్రశ్నించారు. ప్రధాని మోడీ పీఎం హోదాలో తొలిసారి 2025, మార్చి 30న మహారాష్ట్ర నాగ్?పూర్?లోని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్-ఎస్ వ్యవస్థాపకుడు కేశవ్ బలిరామ్ హెడ్గేవార్‌కు ఆయన నివాళులర్పించారు. ఆర్ఎస్ఎస్ భారతదేశ సాంస్కృతిక, సైద్ధాంతిక వారసత్వాన్ని సూచించే మహా వృక్షమని అభివర్ణించారు. అలాగే.. నాగ్?పూర్?లో దివంగత ఖీూ చీఫ్ మాధవరావు సదాశివరావు గోల్వాల్కర్ అలియాస్ గురూజీ జ్ఞాపకార్థం స్థాపించిన మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్?కు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై రోజుకో ట్విస్ట్

విశాఖపట్టణం : వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణపై రోజుకో ట్విస్ట్ వెలువడుతూనే ఉంది. ఇటీవలే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై తమ స్టాండ్ ఏమీ మారలేదు అంటూ కేంద్రం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. దీనిపై అక్కడి కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే లేటెస్ట్ గా విశాఖ ఉక్కు పరిశ్రమను బలోపేతం చేసే అంశంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కేంద్ర బృందం భేటీ అయింది. వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ముఖ్యమంత్రి నివాసంలో చర్చలు జరిపింది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి ప్యాకేజీని మంజూరు చేసిన తర్వాత తదనంతర పరిణామాలపైనా, తీసుకోవాల్సిన చర్యలపైనా ప్రధానంగా చర్చ జరిగింది. సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ... రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం(ఎస్పీఎఫ్)తో ప్లాంట్‌కు భద్రత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చినందుకు ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు స్టీల్ ప్లాంట్ పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించడం, ప్రస్తుతం పనిచేస్తున్న 2 బ్లాస్ట్ ఫర్నేసులతో పాటు, 3వ ఫర్నేస్‌ను కూడా తిరిగి ప్రారంభించడం వంటి అంశాలను ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చర్చించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ తో తమ రాష్ట్రానికి భావోద్వేగ అనుబంధం ఉందని, దీనిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. స్టీల్ ప్లాంట్ బలోపేతం చేసేందుకు తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, ఆర్థిక సాయం ప్రకటించినందుకు ప్రధాని నరేంద్రమోదీకి, కేంద్రానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సమన్వయంతో కలిసి పనిచేయాలని, ఉక్కు కర్మాగారానికి తిరిగి పూర్వ వైభవం తీసుకురావాలని చెప్పారు. ఇందుకు అవసరమైన సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తూనే ఉంటుందని హామీ ఇచ్చారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నిర్వహణ వ్యయం తగ్గించుకోవడంతో సమర్థత, సామర్థ్యం పెంచుకోకపోతే ఆశించిన ఫలితాలు రావని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారని ఆయన కార్యాలయం తెలిపింది. ఈ సమావేశంలో ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, జాయింట్ సెక్రటరీ అభిజిత్ నరేంద్ర, ఎన్ఎండీ సీఎండీ అమితవ ముఖర్జీ, ఆర్ఐఎన్ఎల్ ఇన్చార్జ్ సీఎండీ అజిత్ కుమార్ సక్సేనా, మెకాన్ సీఎండీ ఎస్కే వర్మ, ఎంఎస్టీసీ లిమిటెడ్ సీఎండీ మనోబేంద్ర ఘోషల్ పాల్గొన్నారు.


## కావలసింది కాప్టివ్ మైన్ : కార్మిక సంఘాలు

వైజాగ్ స్టీల్ ప్లాంట్ను బలోపేతం చేయడం పై ప్రభుత్వాలు ముందుకు రావడం సంతోషమే అయినా వైజాగ్ స్టీల్ ప్లాంట్ బతకాలంటే దానికంటూ ప్రత్యేకమైన గనుల కేటాయింపు జరగాల్సిందేనని వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగ కార్మిక సంఘాలు అంటున్నాయి. ప్యాకేజీలతో తాత్కాలికంగా అప్పులు తీరినా శాశ్వతం గా స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి రావాలంటే ముడి ఖనిజ కేటాయింపు మాత్రమే మార్గమని వారు చెబుతున్నారు. ప్రభుత్వాలు కూడా అదే మాట చెబుతున్నాయి. ప్రభుత్వ కార్యాచరణ కూడా ఆ దిశగానే ఉండాలని ఆంధ్ర ప్రజల కోరిక.

# ఎన్నాళ్లీ ఎదురు చూపులు

నెల్లూరు : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటి పోతుంది. త్వరలో ఏడాది పాలన పూర్తి కావస్తుంది. అయినా ఇప్పటి వరకూ నామినేటెడ్ పోస్టుల భర్తీ కొంత వరకే జరిగింది. రెండు విడతలుగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినా కూటమిలోని జనసేన, బీజేపీతో పాటు తమ పార్టీ నేతలకు పంచాల్సి రావడంతో అందరికీ అవకాశం ఇవ్వలేకపోయారు. ఇప్పుడు మూడో దఫా జాబితాను విడుదల చేస్తామని సిద్ధంగా ఉండాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఉగాది నాటికి మూడో విడత నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తారని అందరూ భావించారు. కానీ ఉగాది వెళ్లి పోయినా నామినేషన్ పోస్టుల ఊసే లేకపోవడంతో తెలుగు తమ్ముళ్లలో నిరాశ కనపడుతుంది. వచ్చే మహానాడుకు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారు. మహానాడుకు ఇంకా రెండు నెలలకు పైగానే సమయం ఉంది. గత ఏడాది సెప్టంబరులో తొలి జాబితాను చంద్రబాబు విడుదల చేశారు. మొత్తం ఇరవై కార్పొరేషన్లను నాడు భర్తీ చేశారు. దాదాపు తొంభయి తొమ్మిది మందికి పదవులు లభించాయి. రెండో విడత నామినేటెడ్ పోస్టులను గత ఏడాది నవంబరులో భర్తీ చేశారు. 59 మందికి నామినేటెడ్ పదవులు ఇచ్చారు. గత ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన వారితో పాటు పార్టీ కోసం శ్రమించిన వారికి పదవులను ఇస్తామని చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటానని, వారి నుంచి పూర్తి స్థాయిలో పేర్లు అందలేదని కూడా చంద్రబాబు చెప్పారు. తాజాగా మూడో విడతగా ఏఎంసీ ఛైర్మన్ లతో పాటు మార్కెట్ కమిటీలతో పాటు దేవాదాయాలకు చెందిన కమిటీలను కూడా భర్తీ చేస్తామని చంద్రబాబు చెప్పారు. దీనిపై తమ్ముళ్లు ఆశలు పెట్టుకున్నారు. ఏడాది చూస్తుండగానే గడచిపోయిందని, ఇప్పటి వరకూ తమకు గుర్తింపు లభించలేదని వారు అంటున్నారు. కొన్ని రోజులుగా చంద్రబాబు నియోజకవర్గాల నుంచి నివేదికలను తెప్పించుకుని ఆయన కసరత్తు చేస్తున్నారు. మూడో విడత కూడా పూర్తిగా భర్తీ చేసే అవకాశం కనిపించడం లేదు. కొన్ని ఖాళీలుగా ఉంచి అసంతృప్త నేతలకు ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. నామినేటెడ్ పోస్టులకు అరవై వేల పైచిలుకు దరఖాస్తులు రావడంతో వాటిని వడపోత పట్టేందుకు చంద్రబాబు శ్రమిస్తున్నారు. చిన్నదైనా, పెద్దదైనా నామినేటెడ్ పోస్టులకు ఎంపిక చేస్తే దాని బాధ్యతలను చేపట్టాలని చంద్రబాబు ముందుగానే నేతలకు సంకేతాలు పంపారు. టిక్కెట్లు కోల్పోయిన వారితో పాటు పార్టీకి కష్టకాలంలో పనిచేసిన వారికి మాత్రమే నామినేటెడ్ పోస్టులను గుర్తించి భర్తీ చేయాలన్న నిర్ణయంతో పార్టీ అధినేత చంద్రబాబు ఉన్నారు. అయితే ఇందులో కూడా బీజేపీ, జనసేనలకు కొన్ని కేటాయింపులు జరపాల్సి రావడంతో పాటు సామాజికవర్గాల వారీగా నియామకాలు చేపట్ట వలసి ఉండటంతో కసరత్తు సుదీర్ఘంగా సాగుతుంది. ఉగాది నాటికి గుడ్ న్యూస్ అందుతుందని భావించిన తెలుగు తమ్ముళ్లకు భర్తీ చేయకపోవడంతో నిరాశ ఎదురయింది. దీంతో టీడీపీ లో నామినేటెడ్ పోస్టుల భర్తీ ఎప్పుడు? అన్నది చర్చగా మారింది.

# ఏటీం కార్డుల తరహాలో రేషన్ కార్డులు



విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు టీడీపీ-జనసేన-బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఏటీఎం కార్డు సైజులో ఉండే కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులో క్యూఆర్ కోడ్, ఇతర సెక్యూరిటీ ఫీచర్లు ఉంటాయని నాదెండ్ల మనోహర్ తేల్చి చెప్పారు. కొత్త రేషన్ కార్డుల జారీ సహా వివిధ అంశాలపై ఏపీ సచివాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాకు వివరించారు. ఈ స్మార్ట్ కార్డులో కుటుంబ సభ్యులకు సంబంధించిన అన్ని వివరాలు ఉంటాయని.. అది రేషన్ కార్డుగా కాకుండా ఫ్యామిలీ కార్డుగా ఉంటుందని తెలిపారు. ఇక రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు సంబంధించి కూడా మంత్రి నాదెండ్ల వివరించారు. రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యులను జోడించడం.. ఉన్నవారి పేర్లను తొలగించడం.. స్ప్లిట్ కార్డులు అప్లై చేసుకునేందుకు ఆప్షన్లు ఇస్తామని మంత్రి తెలిపారు. ఈ-కేవైసీ పూర్తైతే ఎంతమందికి రేషన్ కార్డులు జారీ చేయాలో స్పష్టత వస్తుందని మనోహర్ చెప్పారు. ఈ నెలాఖరులోగా ఈ-కేవైసీ పూర్తి చేస్తామని.. ఆ తర్వాత కొత్త రేషన్ కార్డులపై దృష్టి సారిస్తామని వెల్లడించారు. మరోవైపు.. మంగళవారం నుంచే దీపం-2 రెండో విడత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రారంభమైనట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు తీసుకువెళ్లి తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని వెల్లడించారు. అదే సమయంలో వాట్సాప్ ద్వారా కూడా రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పించినట్లు పేర్కొన్నారు. వాట్సాప్ ద్వారా 16 వేల మంది రైతులు ఇప్పటివరకు ధాన్యాన్ని విక్రయించారని తెలిపారు. రైతులకు గన్నీ బ్యాగుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. రైతుకు భరోసా కల్పించేలా ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల అకౌంట్లలో నగదు జమ చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కన్నా 20 శాతం అధికంగా తాము ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. రాష్ట్రంలో బియ్యం అక్రమ రవాణాలో 65 వేల మెట్రిక్ టన్నులను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. మిల్లర్ అసోసియేషన్‌తో కూడా సమావేశాలు పెట్టినట్లు చెప్పారు. కాకినాడలో 3 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి.. ఎప్పటికప్పుడు చెకింగ్ జరుగుతోందని వెల్లడించారు. స్కూళ్లు, హాస్టళ్లలో సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

## డెడ్ స్టోరేజీకి చేరిన
# మూసి నది

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగు, తాగునీటి వనరుగా ఉన్న మూసీ రిజర్వాయర్ లో నీరు అడుగంటింది. జిల్లాలో వర్షాలు సరిగ్గా పడకపోవడం, వేసవిలో ఎండలు తీవ్రం కావడం, ఆయకట్టులో రెండు సీజన్లలో పంట సాగుకు నీటిని విడుదల చేయడంతో మూసీ రిజర్వాయర్లో రోజురోజుకూ నీటిమట్టం తగ్గుతోంది. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్ ప్రస్తుతం 622 అడుగులకు పడిపోయింది. ఆయకట్టులో యాసంగి వరి పంటలు కోతకు రావడంతో ఇటీవల కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు. మూసీ ప్రాజెక్టుకు లీకేజీల సమస్య వేధిస్తుంది. పూడిక తీయకపోవడంతో క్రమంగా నీటి నిల్వ సామర్థ్యం 4 టీఎంసీల నుంచి ఒక్క టీఎంసీకి పడిపోయింది. మరోవైపు ఉన్న నీటి నిల్వలో ఆవిరి, సీపేజీ, లీకేజీ రూపంలో ప్రతిరోజూ 30 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. ఆయకట్టులో ప్రస్తుత యాసంగి సీజన్ కు సంబంధించి వరి పంట కోతకు రావడంతో ఒకట్రెండు రోజుల్లో కాల్వలకు నీటి విడుదలను నిలిపివేయనున్నారు. 4.46 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్లో ప్రస్తుతం 0.75 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ లో 622 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మరో ఎనిమిది అడుగుల నీరు తగ్గితే నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరుకుంటుంది. 615(0.5 టీఎంసీలు) అడుగులకు నీటిమట్టం చేరితే ఒండ్రుతో కూడిన నీరు మాత్రమే రిజర్వాయర్లో ఉంటుంది. కనీసం పశువులు తాగేందుకు కూడా వీలుండదు. మరో రెండు నెలలు గడిస్తే గాని వర్షాలు కురిసి రిజర్వాయర్లోకి నీరు వచ్చే అవకాశం లేదు. అప్పటివరకు ప్రాజెక్టులో నీరు పూర్తిగా అడుగంటే ప్రమాదముందని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత యాసంగి సీజన్ వరి పంట చేతికొచ్చే వరకు నీరందిస్తారోలేదోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టులో పరిధిలోని నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గాల్లో 42 గ్రామాల్లో 33 వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతుంది. గతేడాది జూన్లో మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడం వల్ల వానాకాలం, యాసంగి సీజన్లో రెండు పంటలకు నీటిని విడుదల చేశారు. గత డిసెంబర్ 20 నుంచి యాసంగి పంట సాగుకు మూసీ కుడి, ఎడమ కాల్వలకు అధికారులు మొదటి విడత నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం రెండు కాల్వలకు చివరిదైన నాలుగో విడత నీటి విడుదల కొనసాగుతోంది. కుడి కాల్వకు 201 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 147 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

06-12 ఏప్రిల్, 2025 | జన విజయం | సంపుటి : 8 | సంచిక : 27 | ఖమ్మం
06-12 April, 2025 | JANA VIJAYAM | Volume : 8 | Issue : 27 | KHAMMAM



# జనసేనలో పెరుగుతున్న ఆశవాహులు

విశాఖపట్టణం: జనసేన కూటమిలో మిత్రపక్షంగా ఉండి అధికారంలోకి వచ్చింది. పవన్‌తో పాటు ముగ్గురు మంత్రులు అయ్యారు. ఇద్దరికి ఎమ్మెల్సీ పదవి దక్కింది. మరో ఇద్దరు కీలక నేతలు వెయిటింగ్ లో ఉన్నారు. జనసేన పార్టీ లో కీలకంగా ఉన్న బొలిశెట్టి సత్యనారాయణతో పాటు శివశంకర్ లు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. గత ఎన్నికలలోనూ వారికి ఎమ్మెల్యే సీట్లు దక్కలేదు. అధికారంలోకి రావడంతో తమకు కీలకమైన నామినేటెడ్ పదవులు కానీ, ఎమ్మెల్సీ పదవులు కానీ వస్తాయని ఆశించారు. కానీ ఇద్దరు నేతలకు మాత్రం పది నెలల నుంచి పవన్ కల్యాణ్ నిర్ణయాలు నిరాశపరుస్తున్నాయనే చెప్పాలి. ఎందుకంటే వారిద్దరూ ఉత్తరాంధ్రలో పార్టీకి అండగా నిలిచిన వారిలో ముఖ్యులు. ఇప్పటి వరకూ వారికి ఏ పదవి దక్కలేదు. నెలలుగా ఎదురు చూస్తున్న వారికి ప్రతిసారీ నిరాశ ఎదురవుతుంది. పవన్ కల్యాణ్ దృష్టిలో వీరున్నారా? లేదా? అన్నది అనుమానంగానే ఉంది. సామాజికవర్గం తేడా కొడుతుందని చెబుతున్నారు. ఇప్పటికే అన్ని పదవులు ఒకే సామాజికవర్గానికి చెందిన వారికి ఇవ్వడంపై కూడా ఇతర సామాజికవర్గాల వారు కొంత ఇబ్బంది పడే అవకాశముందన్న అంచనాలు వీరి పదవుల ఆశలపై నీళ్లు కుమ్మరిస్తున్నాయి. పవన్ కల్యాణ్ తమకు ప్రాధాన్యత ఇవ్వాలని భావించినా




సామాజికవర్గం అడ్డుగా వస్తుందేమోనన్న ఆందోళన వారిలో నెలకొంది. త్వరలో ఏ పోస్టు ఖాళీ అయినా వీరికి అవకాశం వస్తుందా? రాదా? అన్నది అనుమానంగానే ఉంది. శివశంకర్ ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ 2018లో స్వచ్ఛంద పదవి విరమణ చేసి జనసేన పార్టీలో చేరారు. విజయనగరం జిల్లాకు చెందిన ఆయన తొలుత హైడ్రో జియాలజిస్ట్ గా పని చేశారు. 1995లో గ్రూప్ 1కు ఎంపికై వాణిజ్య పన్నుల శాఖలో పలు ముఖ్య బాధ్యతలను నిర్వర్తించారు. అంబేద్కర్, పూలే సిద్ధాంతాలతో ప్రభావితమైన శివశంకర్ శ్రీకాకుళంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. పవన్ కల్యాణ్ ఆలోచన విధానాలకు, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై 2018లో ఉద్యోగానికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. అప్పటి నుంచి పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాలుపంచుకొంటూ, పార్టీ అప్పగించిన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం పార్టీ ప్రధాన అధికార ప్రతినిధిగా ఉన్నారు. కానీ శివశంకర్ కు ఇంత వరకూ పార్టీ పదవి తప్ప ఎలాంటి పదవి దక్కలేదు.మరో కీలక నేత బొలిశెట్టి సత్యనారాయణ. ఈయన విశాఖపట్నానికి చెందిన నేత. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంనుండి 16వ లోక్‌సభకు పోటీ చేయలేకపోయారు. ఆయన 2014 భారత సార్వత్రిక ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థిగా ఓడిపోయారు. ఆయన వృత్తి రీత్యా వ్యాపారవేత్త. తర్వాత జనసేనలో చేరి కీలకంగా మారారు. పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి ఆయనపార్టీలో చేరి ఉత్తరాంధ్రలో పార్టీ బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేశారు. పార్టీ కష్ట సమయంలో ఉన్నప్పుడు జనసేన గొంతుగా మారారు. పవన్ కల్యాణ్ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని ఆయన సమర్ధించుకుంటూ వస్తున్నారు. కానీ గత పది నెలల నుంచి ఆయన పెద్దగా యాక్టివ్ లేకపోవడం గమనార్హం. ఎందుకంటే.. పదవి వస్తుందని ఆశపెట్టుకున్న బొలిశెట్టి సత్యనారాయణ గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడంతో పాటు నామినేటెడ్ పదవి కూడా రాకపోవడంతో ఒకింత అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. అయినా ఆయన తాను జనసేనలోనే కొనసాగుతానని, పవన్ కల్యాణ్ వెంటే నడుస్తునానని చెబుతున్నారు.

# సన్నబియ్యం గొప్పదనం ఎవరిది?

**ఖర్చులో కేంద్రం వాటానే ఎక్కువంటున్న బిజెపి**
**పేదల గురించి ఆలోచించేది తామేనంటున్న కాంగ్రెస్**
**ఎవరొచ్చినా కొనసాగించాల్సిందేనంటున్న రేవంత్**
**మోదీ ఫోటో పెందుకు పెట్టరంటున్న బండి సంజయ్**

హైదరాబాద్ : తెలంగాణలో పేదల కడుపు నింపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకంపై రాజకీయ వివాదం నడుస్తోంది. కాంగ్రెస్, బిజెపిల మధ్య ఈ పథకంపై మాటలయుద్ధం నడుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా హుజూర్ నగర్ లో ప్రారంభించారు. 'పేదలు కూడా శ్రీమంతుల్లా సన్న బియ్యం తినాలనే ఆలోచనతో ఈ పథకం తెచ్చామని' ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే రేషన్ షాపుల విధానం, బియ్యం సరఫరా పథకాలు మొదలయ్యాయని రేవంత్ గుర్తు చేశారు. ఇది చరిత్రలో నిలిచిపోయే పథకమనీ, భవిష్యత్‌లో ఎవరు అధికారంలోకి వచ్చినా కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ కంటే ముందు కాంగ్రెస్ సీఎం కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి పేదలకు రూపాయి 90 పైసలకే కిలో బియ్యం ఇచ్చే పథకాన్ని ప్రారంభించారన్నారు సీఎం రేవంత్. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్ ఈ పథకాన్ని కొనసాగించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల కోసమే ఆలోచిస్తుందని, వారి ఆకలి తీర్చేందుకు సన్నబియ్యం పథకం తెచ్చామని రేవంత్ తెలిపారు. సోనియాగాంధీ ఆహార భద్రతా చట్టం తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సన్నబియ్యం పథకంలోని మెజార్టీ ఖర్చు భరిస్తోంది కేంద్రమే అన్నారు కేంద్రమంత్రి బండి సంజయ్. ఒక్కో కిలోకు రూ. 40లు కేంద్రం చెల్లిస్తోందన్నారు. సన్న బియ్యం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై కిలోకు పడే భారం రూ. 10లు మాత్రమేనన్నారు. రేషన్





షాపుల్లో కనీసం మోదీ ఫోటో కూడా పెట్టడం లేదన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు కేంద్రం ఎంత ఖర్చు చేస్తోంది. రాష్ట్రం ఎంత ఇస్తోందనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. పేదలకు బియ్యం పంపిణీ సహా ఇప్పుడు సన్న బియ్యం పంపిణీ వరకు అన్ని పథకాలు కాంగ్రెస్ హయాంలోనే మొదలయ్యాయని కాంగ్రెస్ చెబుతుంటే ఈ పథకం అమలు కోసం కేంద్రమే ఎక్కువ ఖర్చు చేస్తోందని బీజేపీ అప్పుడే కౌంటర్ ఇవ్వడం ప్రారంభించింది. రాబోయే రోజుల్లో ఈ అంశంపై రెండు పార్టీల మధ్య మరింతగా మాటల యుద్ధం కొనసాగే అవకాశం ఉందనే చర్చ వెంుదలైంది. సోనియా గాంధీఆహార భద్రతా చట్టం కోసం చేసిన కృషిని కూడా ఆయన కొనియాడారు. ఈ పథకం క్రెడిట్‌ను కాంగ్రెస్ తీసుకోవాలని చూస్తుండగా, బీజేపీ దీనికి కౌంటర్ ఇచ్చింది. పేదల కోసం కేంద్రం చేస్తున్న ఖర్చును ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఈ వాదనతో బీజేపీ పథకంలో తమ వాటా ఎక్కువగా ఉందని నొక్కి చెబుతోంది. కాంగ్రెస్ మాత్రం, బియ్యం పంపిణీ నుంచి సన్న బియ్యం వరకు అన్ని పథకాలు తమ హయాంలోనే మొదలయ్యాయని, పేదల ఆకలి తీర్చడం తమ లక్ష్యమని చెబుతోంది. దీంతో ఈ అంశంపై రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ వివాదం మరింత రాజకీయ రంగు పులుముకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అప్పలరాజును వెంటాడుతున్న కేసులు

శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లాలో రాజకీయం అంతా ఇప్పుడు సీదిరి అప్పలరాజు చుట్టూనే నడుస్తోంది. ఒకప్పుడు మంత్రిగా ఉన్న ఆయన ఇప్పుడు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. మాజీ మంత్రి, పలాస నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ సీదిరి అప్పలరాజును పోలీస్ కేసులు వెంటాడుతున్నాయి. తాజాగా ఆయనపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. ఢిల్లీరావు అనే వ్యక్తి అనుమానాస్పద మృతి కేసు దర్యాప్తులో జాప్యం జరుగుతుందంటూ శుక్రవారం పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేసినందుకుగాను కేసు నమోదు చేశారు పోలీసులు. విధులకు ఆటంకం కలిగించారంటూ అప్పలరాజుతో పాటు మరో 16 మందిపై కేసు నమోదు చేశారు.రాష్ట్రంలో ఎప్పుడూ పొలిటికల్ హీట్ తో రగిలిపోయే నియోజకవర్గాలలో పలాస నియోజకవర్గం ఒకటి. ఇక్కడ ఏ పార్టీ అధికారంలో ఉన్న నిత్యం ఏదో ఒక అంశంపై రచ్చ జరుగుతూ వార్తలలో ఉంటుంది ఈ నియోజకవర్గం. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు పక్కన పెడితే ఇక్కడి నేతలను పోలీసు కేసులు వెంటాడుతూ ఉంటాయి. ప్రతిపక్ష వైసీపీకి చెందిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు కేసులు నమోదయ్యాయి. వీటికి తోడు ఇప్పుడు తాజాగా మరో కేసు నమోదు కావడంతో కేసుల సంఖ్య నాలుగుకి చేరింది. తాజాగా పోలీసుల విధులకు ఆటంకం కల్పించారంటూ శ్రీకాకుళం జిల్లా కాశిబుగ్గ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.పలాస మండలం నీలావతికి చెందిన ఢిల్లిరావు అనే పౌర హక్కుల సంఘం నేత అనుమానాస్పద మృతి కేసు విషయమై శుక్రవారం(మార్చి 28) మృతిని భార్య కమల, గ్రామ పెద్దలతో కలిసి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఢిల్లీ రావు మృతికి కారణం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. 3 నెలలు గడిచినా ఇప్పటికీ పోలీసులు మృతికి కారణం ఏంటనేది చెప్పలేకపోతున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, మాజీ మంత్రికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దర్యాప్తు వేగవంతం చేసి నెల రోజుల్లో ఢిల్లి రావు మృతికి కారణం ఏంటనేది స్పష్టం చేస్తామని చివరకు పలాస ఊఖ వెంకట అప్పారావు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు అప్పలరాజు.అయితే అదే రోజు అదే పోలీస్ స్టేషన్ లో ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ జరగాల్సి ఉంది. కాసేపటిలో కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ కి వాఖ చేరుకుంటారనగా మాజీ మంత్రి అప్పలరాజు నిరసనకు దిగారు. దీంతో గుంపుగా ధర్నా చేపట్టి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ అప్పలరాజుతో సహా మరో 16 మంది పైన పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే సీదిరి అప్పలరాజుపై కూటమి ప్రభుత్వం వచ్చాక వివిధ అభియోగాలపై జిల్లాలో మూడు కేసులు నమోదు కాగా తాజాగా ఇపుడు ఆయనపై మరో కేసు నమోదయింది.తనపై పోలీసులు తాజాగా మరో కేసు నమోదు చేయటంపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఘాటుగానే స్పందించారు. మేము ధర్నా చేసామని మాపై ఈఎఫ్ఐ నమోదు చేస్తే.. ఢిల్లీ రావు మృతి చెంది మూడు నెలలైన కనీస వివరాలు వెల్లడించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులను ఏం చెయ్యాలని ప్రశ్నించారు. ఇది మీ రోజు.. తైతక్కలు ఆడండి మేం భరిస్తాం. కానీ మా రోజు వచ్చినపుడు మాత్రం ఇంతకన్నా గట్టిగా మీ చేత తైతక్కలాడిస్తాం అని మంత్రి పోలీసులను హెచ్చరించారు. ఈ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో తనపై నాలుగు కేసులు పెట్టారని, రానున్న నాలుగేళ్లలో ఇంకా తనపై ఎన్ని ఈఎఫ్ఐ లు వేయాల్సి వస్తాదో అని అన్నారు.తెప్పల ఢిల్లీరావు అనే ఉద్ధానం వాసి మృతి కేసులో నిజనిజాలు వెల్లడించండని అనేకసార్లు డిఎస్పీకి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. పోలీసులు రెండు రోజుల్లో, వారం రోజుల్లో చెబుతామని చెప్పి ఎంతకీ తేల్చకపోతే తాము వెళ్లి స్టేషన్ ముందు ధర్నా చేశామని చెప్పారు. ప్రశ్నించే వారిపై ఈఎఫ్ఐ లు వేస్తామంటే అదేం పరిపాలన అని మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దలు, ప్రజా ప్రతినిధులు ఖచ్చితంగా గట్టిగా సమాధానం చెప్పే రోజు వస్తాదని అన్నారు. మరోవైపు, మాజీ మంత్రి అప్పలరాజు తోపాటు మరో 16 మందిపైన పోలీసులు కేసు నమోదు చేయటంపై మృతుడు ఢిల్లిరావు భార్య తెప్పల కమల సైతం స్పందించారు. 50 ఏళ్లకే నా భర్తను దారుణంగా చంపేశారని, దానిపై పోలీసుల నుండి సరైన రెస్పాన్స్ లేకపోతే ఎస్పీకి వినతి పత్రం ఇచ్చేందుకు గ్రామ పెద్దలు, మిగతా సర్పంచులతో కలిసి వెళ్ళానని కమల చెప్పారు. తనకు న్యాయం చేయండి అని ఎస్పీ కలిసి అడగడానికే తాము వెళ్ళామని చెప్పారు. తన భర్త చనిపోయాక 3నెలలుగా తాను, తన కొడుకు దిక్కులేని వారీగా ఉంటున్నామనిఆమె అవేదన వ్యక్తం చేశారు. ఇలా మాపై కేసులు పెట్టి ఈరోజో రేపో మమ్మల్ని కూడా చంపేసేటట్టు ఉన్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు.ఇదిలావుంటే, మరో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు పంపారు. క్వార్జ్ అక్రమంగా తరలించారా? లేదా? సోమిరెడ్డి ఆరోపణల్లో నిజమెంత? స్టేషన్‌కు వచ్చి సమాధానం ఇవ్వండి అంటూ మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి నోటీసులు ఇచ్చారు పోలీసులు. నెల్లూరు జిల్లా తాటిపర్తిలో రుస్తుం మైన్స్ కేసులో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి నోటీసు ఇచ్చిన పోలీసులు.. విచారణకు రావాలంటూ సూచించారు. నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు కాకాని ఇంటికి వెళ్లిన సమయంలో ఆయన అందుబాటులో లేకపోవడంతో ఇంటి గేటుకు నోటీసులు అంటించారు.రుస్తుం మైన్స్ కేసులో ఇప్పటికే ఏడుగురిపై ఈఎఫ్ఐ నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో కాకాని పేరును o4గా చేర్చారు. పొదలకూరు మండలం తాటిపర్తి రుస్తుం మైన్స్‌లో అక్రమంగా వైట్ క్వార్జ్ తరలించారంటూ 2024లో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో పాటు క్వారీ వద్ద నిరసన చేపట్టారు. ఆ కేసుకు సంబంధించి ప్రస్తుతం విచారణ చేస్తున్న పోలీసులు.. కాకాని గోవర్ధన్ రెడ్డిని విచారణకు పిలిచారు. ఈ కేసులో కాకాని ఇప్పటికే ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. తనపై తప్పుడు కేసు పెట్టారని ఇప్పటికే ఆరోపించిన కాకాని ఎలాంటి విచారణకైనా సిద్ధమని ప్రకటించారు. నోటీసులు ఇచ్చేందుకు వెళ్లిన సమయంలో కాకాని అందుబాటులో లేరు. మరి పోలీసుల నోటీసులపై ఏ విధంగా స్పందిస్తారు? విచారణకు హాజరు అవుతారా లేదా ఉన్న ఉత్కంఠ నెలకొంది.

# క్లైమాక్స్‌కు విస్తరణ ఎపిసోడ్

హైదరాబాద్ : తెలంగాణ క్యాబినెట్ విస్తరణ ఎపిసోడ్ ఎట్టకేలకు క్లైమాక్స్‌కు చేరుకుంది. ఏప్రిల్ 3న క్యాబినెట్ విస్తరణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి గట్టి పట్టుదలతో కనిపిస్తున్నారు. అయితే క్యాబినెట్ విస్తరణ వేళ మంత్రుల పోర్టుఫోలియోల్లో కూడా మార్పులు తప్పవంటూ ఒక చర్చ పొలిటికల్ సర్కిళ్ల చక్కర్లుకొడుతోంది. కొందరు మంత్రులు సైతం తమ శాఖలను మార్చాలంటూ రిక్వెస్ట్ చేస్తున్నారట. మరోవైపు మంత్రుల పనితీరు ఆధారంగా మార్పులు తథ్యమని బలమైన టాక్ గాంధీభవన్‌లో వినిపిస్తోంది. ఐతే ఎవరెవరి శాఖలు మారుతాయనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది.తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. సామాజిక సమీకరణలంటూ నేతలు ట్విస్ట్ ఇస్తే.. పోర్టుఫోలియోలో ఛేంజెస్ అంటూ హైకమాండ్ రివర్స్ షాక్ ఇస్తోంది. మంత్రివర్గ విస్తరణతో పాటు పనితీరు ఆధారంగా మంత్రుల పోర్ట్ ఫోలియోలు కూడా మారుస్తామంటూ అధిష్టానం లీకులు ఇస్తోందనేది గాంధీభవన్‌లో వినిపిస్తోన్న గాసిప్.చాలాకాలంగా పెండింగ్ పడుతూ వస్తున్న మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. సామాజిక సమీకరణాల ఆధారంగా ఎవరెవరికి ఛాన్స్ ఇవ్వాలనే దానిపై కన్‌క్లూజన్‌కు వచ్చేసింది. ఏప్రిల్ 3న క్యాబినెట్ విస్తరణ ఉంటుందని ఇప్పటికే రాజ్‌భవన్‌కు ప్రభుత్వవర్గాలు సమాచారమిచ్చాయట. ఇదిలా ఉంటే మంత్రివర్గ విస్తరణతో పాటు పనితీరు ఆధారంగా మంత్రుల పోర్ట్‌ఫోలియోలు కూడా మారుస్తారనే ప్రచారం మొదలైంది.. ప్రస్తుతం ఉన్న శాఖలతో పాటు సీఎం దగ్గరున్న శాఖలను కేటాయించే విషయంపై కూడా అధిష్టానం దగ్గర చర్చ జరిగిందట.మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఖాళీగా ఉన్న ఆరు బెర్తుల్లో నాలుగింటిని భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. కొత్తగా నలుగురు మంత్రులు వచ్చి చేరాక .. శాఖల కేటాయింపు చేయాల్సి ఉంటుంది. అయితే పాత మంత్రులు కొందరు తమ శాఖలను మార్చాలని కోరుతుండగా.. మరోవైపు సీఎం సైతం పనితీరు ఆధారంగా శాఖల మార్పులు చేర్పులు చేయాలని చూస్తున్నారట. ఈ విషయాన్ని ఇప్పటికే పార్టీ అధిష్టానానికి చెప్పి గ్రీన్ సిగ్నల్ తీసుకున్నారట ముఖ్యమంత్రి. ఇదే విషయంపై సహచర మంత్రులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భేటీ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఇండికేషన్ కూడా ఇచ్చారట.శాఖల విషయంలో కొందరు మంత్రులు కాస్త అసంతృప్తిగా ఉన్నారని గాంధీభవన్‌లో వినిపిస్తున్న టాక్. ముఖ్యంగా ఆర్థికశాఖను నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన శాఖను మార్చాలని కోరుతున్నారట. ఈ మధ్య కాలంలో ఫైనాన్స్ బిల్లులకు సంబంధించి పొలిటికల్ సర్కిళ్లలో రకరకాల చర్చలకు దారి తీస్తోంది. ఏకంగా అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కమిషన్ల ప్రభుత్వమని.. బిల్లులు క్లియర్ చేయడానికి ఆర్థికశాఖ 20శాతం కమిషన్ తీసుకుంటుందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇలాంటి ఆరోపణలు ఎక్కువ అవుతుండటంతో.. ఆర్థికశాఖ నుంచి దూరంగా ఉండాలని భావిస్తున్నారట భట్టి. అందుకే ఈ శాఖ మరెవరికైనా ఇవ్వాలని కోరుతున్నారట.ఇక ఇరిగేషన్‌శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా తన శాఖ మార్చాలని హైకమాండ్‌ను రిక్వెస్ట్ చేస్తున్నారట. అలాగే వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న దామోదర రాజనర్సింహ సైతం తనకు శాఖ మార్చి విద్యాశాఖను ఇవ్వాలని కోరుతున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మరోవైపు పొంగులేటి దగ్గర ఉన్న శాఖల్లో కూడా మార్పులు చేర్పులు ఉంటాయనే ప్రచారం జరుగుతోంది.ఇక ఇద్దరు మహిళా మంత్రులు సైతం తమ శాఖల్ని మార్పులు చేయాలని కోరుతున్నారట. మంత్రి సీతక్క తనకు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కావాలని కోరుతున్నారు. ఒక ఎస్టీ మహిళగా తమ వర్గానికి చెందిన శాఖను ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తున్నారు. మరో మహిళా మంత్రి కొండా సురేఖ సైతం తన దగ్గర ఉన్న దేవదాయ, అటవీశాఖ కాకుండా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కావాలని కోరుతున్నారట.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొండా సురేఖకు ఈ శాఖ చేసిన అనుభవం ఉంది. అందుకే ఈ శాఖ కోసం ట్రై చేస్తున్నట్లు తెలుస్తోంది.ఇక అమాత్య బెర్తులు కన్ఫామ్ అని కాన్ఫిడెంట్‌గా ఉన్న వారు సైతం శాఖల విషయంలో ముఖ్యమంత్రికి తమ ఆలోచనలను చెప్పారట. ఇప్పటికే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు హోంశాఖ కావాలని బాహాటంగానే చెబుతున్నారు. మరోవైపు శాఖల పనితీరు.. కొందరు మంత్రులపై వస్తున్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో.. శాఖల మార్పులు చేర్పులు చేయాలని సీఎం రేవంత్ కూడా గట్టి పట్టుదలతో ఉన్నారట. ఈ పరిస్థితుల నేపథ్యంలో పాత, కొత్త వారికి శాఖల కేటాయింపుల సందర్భంగా మార్పులు, చేర్పులు ఖాయమనే చర్చ జరుగుతోంది.తెలంగాణ క్యాబినెట్ విస్తరణ అంశం తుదిదశకు వచ్చినప్పటికీ ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. క్లైమాక్స్‌లో ఛాన్స్ కొట్టేసేందుకు కొందరు ట్రై చేస్తుంటే.. మంత్రిగా బెర్త్ కన్ఫామ్ అయినవారు శాఖలపై దృష్టి పెట్టారు. మరోవైపు సీనియర్ మంత్రులు కూడా తమ శాఖలు మార్చాలని కోరుతున్నారు. ఎవరి ప్రయత్నాలు ఎలా ఉన్నా కాంగ్రెస్ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందనేది వేచి చూడాలి.

# నీటి కొరత షూరూ...

హైదరబాద్ : హైదరాబాద్ నగరంలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. నగర అభివృద్ధి వేగంగా జరుగుతున్నప్పటికీ.. దీని ప్రభావం భూగర్భ జలాలపై తీవ్రంగా పడింది. ఇటీవల జలమండలి జరిపిన ఒక సర్వేలో హైదరాబాద్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు తీవ్రమైన స్థాయిలో పడిపోవడం గుర్తించబడింది. ఔటర్ రింగ్ రోడ్డు వరకూ 948 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్వహించిన సర్వేలో.. కేవలం 27 చదరపు కిలోమీటర్లలోనే జలమండలి సూచించిన స్థాయిలో జలాలు ఉన్నాయని.. మిగతా 921 చదరపు కిలోమీటర్లలో ఈ జలాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నట్లు నిర్ధారించారుపరిణామం.. నగరంలోని అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాలైన హైటెక్ సిటీ, మాదాపూర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో కూడా తీవ్ర ప్రభావాన్ని చూపింది. జలమండలి చేసిన సర్వేలు ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు దాదాపు లేనట్టుగా సూచిస్తున్నాయి. ప్రత్యేకంగా.. ఎఐఇం చుట్టూ దాదాపు 5 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలలో వర్షపు నీరు ఎక్కడా భూమిలోకి రాకుండా సిమెంట్ పల్లాలు, ఇతర నిర్మాణాలు అడ్డుకుపోతున్నాయని గుర్తించారు.గత ఏడాది కంటే వర్షపాతం ఎక్కువ అయినప్పటికీ.. అందులోని నీరు ఎక్కువగా గ్రౌండ్‌వాటర్‌కు చేరకుండానే.. మూసీ నదిలోకి లేదా డ్రైనేజీ ద్వారా వెళ్లిపోతున్నట్లు కనిపిస్తోంది. ఈ పరిస్థితుల వల్ల.. నగరంలోని ప్రజలు 11,000 ట్యాంకర్లను ప్రతిరోజూ తమ అవసరాల కొరకు బుక్ చేస్తున్నారు. 2024లో.. నగరంలో 586 వాటర్ ట్యాంకర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పుడు 678 వాటర్ ట్యాంకర్లు వినియోగంలో ఉన్నాయి.ఈ పరిస్థితికి పరిష్కారం చూపడానికి జలమండలి 81 వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. కానీ ఈ డిమాండ్ పెరిగిపోవడంతో.. జలమండలి మరో 17 కొత్త స్టేషన్లను ప్రారంభించడానికి సిద్ధమైంది. హైదరాబాద్‌లోని అగ్రనగరాలు.. హైటెక్ సిటీ, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, నిజాంపేట్, మాదాపూర్, ప్రగతి నగర్, మణికొండ, ఎస్సార్ నగర్ ప్రాంతాలు ఇప్పటికే అత్యధికంగా వాటర్ ట్యాంకర్ల డిమాండ్‌ను ఎదుర్కొంటున్నాయి. పలు అపార్ట్మెంట్లలో బోర్లు పని చేయక.. వాటర్ ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది.ఈ పరిస్థితి.. పర్యావరణ రక్షణకు సంబంధించిన ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. జల వనరులను సురక్షితంగా కాపాడుకోవడం.. వాటి వినియోగాన్ని సక్రమంగా నిర్వహించడం.. తద్వారా భవిష్యత్తులో నీటి సమస్యలను నివారించడానికి ప్రజలు , అధికారులు కలిసి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# తీవ్రరూపం దాలుస్తున్న హెచ్ సీయూ భూముల వివాదం

హైదరాబాద్ : సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే.. ప్రభుత్వానికి భూముల వేలం వేయక తప్పని పరిస్థితి. ఎప్పటి నుంచో ఈతతంగం జరుగుతుంది. ఇది కొత్తేమీ దకాదు. కాకుంటే ఇది హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు అని విద్యార్థులు ఆందోళనకు దిగడం, దీనికి రాజకీయ రంగు పులుము కోవడంతో ఒకింత ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ హెచ్.ఎం.డీ.ఏ పరిధిలోని భూములను విక్రయించడంతో పాటు వేలం వేయడం ద్వారా వచ్చిన అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా వినిపిస్తుంది. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హాఆమీలను అమలు చేయాలంటే అవసరమైన నిధులు అవసరం. హెచ్.సి.యూ భూములను ఇంచు కూడా తీసుకోలేదు కేంద్రం నుంచి నిధులు అందక.... ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో కేంద్రం నుంచి అంత సహకారం అందదన్నది అందరికీ తెలిసిందే. ప్రత్యేక నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే అవకాశాలు లేవు. ఇక ఆదాయాన్ని పెంచుకునేందుకు కూడా ప్రజలపై పన్నుల భారాన్ని పెంచాలన్నా అది ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందన్న భావన కాంగ్రెస్ నేతల్లో ఉంది. ఇటు ప్రజలపై ఛార్జీల భారం మోయలేక, అటు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో హామీలను అమలు చేయాలన్నా ప్రభుత్వానికి భూముల వేలం తప్పని సరి. అయితే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి పక్కనే ఉన్న భూముల జోలికి పోవడమే ఇప్పుడు ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. కొద్ది రోజులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. వారంతా హెచ్.సి.యూకి చెందిన భూములను ఎలా విక్రయిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. అయితే ఇది హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందని భూములు కావని, గతంలోనే ప్రభుత్వానికి ఈ భూముల బదలాయింపు జరిగిందని, న్యాయస్థానాల్లో కూడా కేసులు నడిచాయని ప్రభుత్వ గుర్తు చేస్తుంది. గత రెండు రెండో రోజుల నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో జేసీబీలు చదును చేస్తుండటంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. వీరికి బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తోడయ్యారు. దీంతో ఇది ప్రభుత్వానికి తలనొప్పిగా మారి చికాకును కల్గిస్తుంది. అందువల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులుతో సమావేశమయై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదంపై ఆయన సమీక్ష జరిపారు. ప్రజా సంఘాలతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా సమావేశమై వారికి ఈ భూముల బ్యాక్ గ్రౌండ్ ను వివరించే ప్రయత్నం చేశారు. ఇవి ప్రభుత్వానికి చెందిన భూములు కావడంతోనే తాము వేలం వేయడానికి నిర్ణయించామని, కంచె గచ్చిబౌలిలో గతంలో ఈ స్థలం ప్రభుత్వానికి హెచ్.సి.యూ స్వాధీనం చేయడంతో దానికి ప్రత్యామ్నాయంగా భూమిని కూడా కేటాయించినట్లు గుర్తు చేశారు. మొత్తం మీద ఆదాయం పెంచుకోవాలన్న కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నానికి రాజకీయ పార్టీలు గట్టిగానే అడ్డుకుంటున్నాయి. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# ఆర్థిక వనరుగా మారిన ఇప్పపువ్వు

## మన్ కీ బాత్ లో మోడీ ప్రస్తావన

అదిలాబాద్ : ఇప్పపువ్వు.. వేసవి కాలంలో మాత్రమే లభించే ప్రత్యేకమైన పువ్వు. ఈ పువ్వు ఆదివాసీలకు ఆర్థిక వనరుగా మారి జీవనోపాదినిస్తోంది. గత దశాబ్దం క్రితం ఈ ఇప్పపూలతో నాటు సారా తయారుచేసే వారే గిరిజనులు. ప్రభుత్వం సహాయ సహకారాలు అందించడంతో గిరిజన మహిళల రక్తహీనతను తగ్గించేందుకు ఇప్ప పువ్వుతో లడ్డూలను తయారు చేసేందుకు ముందుకొచ్చారు ఆదివాసీ గిరిజన మహిళలు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలో దేశంలోనే తొలిసారిగా 2020లో పైలట్ ప్రాజెక్టు కింద భీంబాయి సహకార సంఘం పేరిట ఇప్పపువ్వు లడ్డూల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 1,845, కుమురం భీం అసిఫాబాద్ జిల్లాలో 817 మంది గిరిజన గర్భిణులకు ఈ ఇప్పపువ్వు లడ్డూలను అధికారులు అందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ స్కూళ్లలో చదువుతున్న గిరిజన విద్యార్థినులకు ఈ లడ్డూలను సరఫరా చేస్తున్నారు. అధికారులు నెలకు దాదాపు 20 క్వింటాళ్ల ఇప్పపువ్వు లడ్డూలను భీంబాయి సంఘం నుంచి కొనుగోలు చేసి విద్యార్థినులకు అందిస్తున్నారుమన్ కీ బాత్‌లో ఈ విషయాన్ని మోదీ ప్రస్తావించడంతో సర్వత్ర ఇప్పపువ్వు లడ్డూ చర్చనీయాంశమైంది. ఆదిలాబాద్ జిల్లా సోదరీమణులు ఇప్పపువ్వుతో కొత్త ప్రయోగం చేశారన్నారు మోడీ. రకరకాల వంటలు చేస్తున్నారని.. వీటిని ప్రజలు చాలా ఇష్టంగా తింటున్నారని? వారి వంటల్లో ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయం, కమ్మదనం కనిపిస్తుందని ప్రదాని మోదీ ప్రశంసించారు. ప్రధాని ప్రశంసించడంపై భీంబాయి ఆదివాసీ మహిళా సంఘం అధ్యక్షురాలు కుమ్ర భాగుబాయి, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పరిశ్రమను విస్తరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఇప్పపువ్వుతో తయారు చేస్తున్న లడ్డూలను గిరిజన గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి కూడా అందజేస్తున్నారు. ఒక లడ్డూ 20 గ్రాముల బరువుంటుండగా.. కిలో లడ్డూల ధర రూ.300గా నిర్ణయించారు. కిలో లడ్డూ తయారీకి 400 గ్రాముల ఇప్పపువ్వులు, 190 గ్రాముల బెల్లం, 190 గ్రాముల పల్లీలు, 190 గ్రాముల నువ్వులు, 30 గ్రాముల కిస్మిస్, మంచి నూనెను కలిపి తయారు చేస్తారు. లడ్డూల తయారీ కోసం ముందుగా ఇప్పపువ్వును సేకరిస్తారు. సేకరించిన ఇప్పపువ్వును ఆరుబయట ఎండలో ఆరబెడతారు. ఆ తర్వాత వాటిని నూనెలో వేయిస్తారు. వేయించిన నువ్వులు, పల్లీలను దానికి జత చేసి చల్లబడ్డాక బెల్లం కూడా కలుపుతారు. ఈ పదార్థాలతో పాటు కిస్మస్, యాలకులు, మిరియాలపొడి కలిపి ఉండలుగా చుట్టి లడ్డూలు తయారు చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని ఎక్స్ రోడ్ లో ఆదివాసి ఆహారం పేరిట ఆదివాసీ మహిళలు ఇప్పపువ్వు లడ్డు తయారీ కేంద్రాన్ని నడిపిస్తున్నారు. భీంబాయి ఆదివాసీ మహిళ సహకార సంఘం అధ్వర్యంలో ఈ లడ్డూ కేంద్రాన్ని 12 మంది ఆదివాసీ మహిళలు కలిసి నడిపిస్తున్నారు. టీం లీడర్ గా కుమ్ర భాగుబాయి దీన్ని ముందుకూ తీసుకెళ్తున్నారు. గత ఐదేళ్ల కిందట అప్పటి జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్ ఈ లడ్డూ కేంద్రానికీ సహకారం అందించారు. దీంతో ఆదివాసీ మహిళలు స్వయం ఉపాధిని పొందుతూ ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి మహిళలు నెలకొంటున్న రక్త హీనత సమస్యను సైతం దూరం చేస్తున్నారు. ఇప్పపువ్వు ఈ వేసవిలో వస్తుంది. వేసవిలో లభించే ఈ ఇప్పపువ్వులను ఆదివాసి మహిళలు వేకువజామున వెదురుబుట్టలలో సేకరించి ఇంటికి తీసుకొచ్చి ఎండలో ఆరబెట్టి ఈ ఇప్ప పూలతో రక రకాల వంటకాలు తయారు చేసుకొని తింటారు. ఈ ఇప్పపువ్వులను లడ్డు కేంద్రానికి సైతం విక్రయిస్తూ ఆదివాసీ మహిళలు ఉపాధిని సైతం పొందుతున్నారు. ఈ లడ్డులను ఆర్డర్లు ఉన్న చోట బాక్సులలో పెట్టి విక్రయిస్తున్నారు. ఈ లడ్డు తినడానికి ఎంతో కమ్మగా రుచికరంగా ఉంటుంది. ఈ రుచికరమైన ఇప్ప పువ్వు లడ్డులను తింటే మంచి బలం వస్తుంది, ఆరోగ్యానికి ఎంతో బాగుంటుంది. ముఖ్యంగా మహిళలకు ఉన్న రక్త హీనత సమస్య బాగుపడుతుంది. ఈ లడ్డూ తింటే రక్తం వృద్ధి చెందుతుంది. ఆదివాసీ మహిళల స్వయం కృషిని అభినందిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పలు సంస్థలు అవార్డులను సైతం అందించారు. 2023లో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆది మహోత్సవ్ నేషనల్ ట్రైబల్ ఫెస్టివల్ కార్యక్రమంలో.. స్కిల్ డెవలప్‌మెంట్.. ఇక్రిశాట్, జిల్లా కలెక్టర్ ఐటిడిఎ పిఓలు అవార్డులను అందజేశారు. ఇదే విషయాన్ని ఉగాది పర్వదినం సందర్భంగా ప్రదాని నరేంద్ర మోదీ ఇప్పపువ్వు లడ్డూపై ప్రశంసలు కురిపించారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం తరఫున జార్ఖండ్ రాష్ట్రానికి వెళ్లి ఇప్పపువ్వు లడ్డు వంటకాల తయారీ గురించి అక్కడి ప్రజలకు అవగాహన కలిగించారు భీంబాయి సంఘం సభ్యులు. ఇప్పపువ్వులతో శరీరానికి ఎంతో మేలని, ఈ లడ్డు తినడం వల్ల కండరాలు బలంగా ఉండడంతో పాటు మోకాళ్ళ నొప్పులు రక్తహీనత మొదలైన వ్యాధులను నియంత్రిస్తుందని రక్తం వృద్ధి చెందుతుందని ఇక్రిశాట్ పరిశోధనలోను వెల్లడైందని తెలిపారు. ఆదివాసీ మహిళల కృషిని, వారు తయారుచేసిన పోషకమైన లడ్డూలను ప్రధానమంత్రి మోదీ ప్రశంసించారు. ఇది వారి స్వయం ఉపాధికి ఉదాహరణ మాత్రమే కాదు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఆదిలాబాద్‌కు చెందిన ఈ గిరిజన మహిళల విజయగాథ స్థానిక వనరులను ఉపయోగించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను ఎలా సృష్టించవచ్చో, సమాజంలో సానుకూల మార్పును ఎలా తీసుకురావచ్చో చూపిస్తుందని ప్రధాని మోదీ కొనియాడారు.

# సోషల్ మీడియాలో ప్రచారానికి హద్దే లేదా

రాజమండ్రి : నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టుంది ప్రస్తుత రాజకీయాలు. సోషల్ మీడియా జనరేషన్‌లో పాలిటిక్స్ మరింత దారుణంగా ఉంటున్నాయి. పాస్టర్ ప్రవీణ్ పగడాల డెత్ కేసులో ఎంత రచ్చ జరిగిందో అంతా చూస్తున్నారు. సీసీఫుటేజ్‌లో చిన్న అనుమానం కూడా లేదు. ప్రవీణ్ ఒంటిపై దాడి జరిగిన ఆనవాళు కూడా లేవు. కత్తి పోట్లు, దెబ్బలు, విష ప్రయోగం.. గట్రా ఎలాంటి డౌట్ లేదు. కానీ, చంపేశారు.. చంపేశారు.. అంటూ సోషల్ మీడియాలో విష ప్రచారం చేశారు. సొసైటీలో మత చిచ్చు రగిల్చే ప్రయత్నం చేశారు కొందరు. ఈ తరహా ప్రచారం వెనుక ఓ పార్టీ ప్రోద్బలం ఉందనే ఆరోపణ ఉంది. ఆ పార్టీ అనుకూల వర్గీయుల నుంచే ఎక్కువగా రెచ్చగొట్టే పోస్టులు, కామెంట్లు వచ్చాయని పోలీసులు గుర్తించారు. వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకూ సిద్ధమవుతున్నారు. చనిపోయింది పాస్టర్ కాబట్టి.. ఎలా చనిపోయారో తెలీటం లేదు కాబట్టి.. చంపేశారు అంటే సరిపోతుందా? సున్నితమైన అంశం కావడం తమకు కలిసి వస్తుందని అనుకుంటున్నారా? కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకు ఇంతలా రెచ్చగొట్టాలా? మతం రంగు పులిమేసి.. జనాల్లో విద్వేషాన్ని రగిలిచ్చి ఏం చేయాలనుకున్నారు? ఆ వేడిలో రాజకీయ పబ్బం గడుపుకునే వ్యూహం పన్నారా? మరీ, ఇంతటి ప్రమాదకరమైన క్రీడ ఆడటం కరెక్టేనా? హైదరాబాద్ నుంచి కొవ్వూరు వరకు.. దారి పొడవునా గంటల తరబడి సీసీకెమెరా ఫుటేజ్ దొరికింది కాబట్టి సరిపోయింది. లేదంటే పోలీసులు చెప్పిన విషయాల్ని అంత ఈజీగా ఎవరైనా నమ్మేవాళ్లా? పాస్టర్ ప్రవీణ్ పగడాల విజయవాడ చేరుకోవడం.. అక్కడ పార్కులో సేద తీరడం.. అప్పటికే ఆయన బుల్లెట్ బండి హెడ్‌లైట్ పగిలిపోయి ఉండటం.. చాలా నీరసించి ఉండటం.. ఆ తర్వాత దారి మధ్యలో లిక్కర్ కొనడం.. ఇలా మినిట్ టు మినిట్ కంప్లీట్ సీసీఫుటేజ్ బయటపెట్టారు ఏపీ పోలీసులు. అవన్నీ చూశాక కానీ.. ప్రవీణ్‌ది హత్య కాకపోవచ్చు.. యాక్సిడెంటో, అస్వస్థత వల్లో చనిపోయి ఉండొచ్చు అని ప్రజలు ఇప్పుడిప్పుడే ఓ అంచనాకు వస్తున్నారు. ఒకవేళ ఆ సీసీకెమెరా దృశ్యాలు లభించి ఉండకపోయి ఉంటే..? ప్రవీణ్‌ను చంపేశారని ప్రజలకు ఫిక్స్ చేసేవారే కదా? సోషల్ మీడియా రచ్చ ఇప్పట్లో ఆగి ఉండేదా? క్రిష్టియన్లకు మిగతా వర్గాలకు మధ్య చిచ్చు పెడితే.. రాష్ట్రం మతాల వారిగా విడిపోతే.. అది అందరికీ నష్టమే కానీ ఎవరికీ లాభం కాదు. చివరికి ఆ పార్టీకి కూడా. అందరికీ అన్ని వర్గాల మద్దతు కావాల్సిందేగా. ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్ అయ్యారు? ఇప్పుడే కాదు గతంలోనూ ఇలాంటి డైవర్ట్ పాలిటిక్స్ చూశాం. వివేకానందరెడ్డిని గొడ్డలితో అతి దారుణంగా తల నరికి చంపారు. ఆయన డెడ్‌బాడీ రక్తపు మడుగులో పడి ఉంది. ఆ స్పాట్ చూస్తే చిన్నపిల్లాడైనా చెప్పేస్తాడు అది హత్య అని. కానీ, గుండెపోటు అని ప్రకటించి చావు తెలివితేటలు చూపించారు కొందరు. అలా కొన్నిగంటల సేపు మాత్రమే బుకాయించ గలిగారు. నిజం బయటకు రాకుండా సమాధి చేయలేక పోయారు. ఆ కేసుతో సంబంధం ఉన్న వాళ్లంతా ఇటీవల వరుసగా చనిపోతుండటం.. హత్యా రాజకీయాలు ఇంకా ఆపలేదనే అనుమానాన్ని బలపరుస్తోంది. వివేక కేసులో హత్యను గుండెపోటుగా చిత్రీకరిస్తే.. పాస్టర్ ప్రవీణ్ పగడాల లాంటి సెన్సిటివ్ కేసులో మర్డర్ ముసుగు వేసే ప్రయత్నం పక్కా ప్లాన్డ్‌గా జరిగిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ దిశగా కూడా పోలీసుల విచారణ కొనసాగుతోంది. అదే నిజమని తేలితే సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరిస్తున్నారు.


# జగన్ లో ఎంత మార్పో...

విజయవాడ : అధికారంలో ఉన్నప్పుడు జగన్ కార్యకర్తల్ని, స్థానిక నేతల్ని పెద్దగా పట్టించుకోలేదనే ఆరోపణ ఉంది. దానికి ఆయన ప్రవర్తనే ప్రత్యక్ష సాక్ష్యం. లోకల్ లీడర్స్ తో పెద్దగా కలిసేవారు కాదు జగన్, ఆ మాటకొస్తే మంత్రులకు కూడా అపాయింట్ మెంట్లు దక్కేవి కావు, ఇక ఎమ్మెల్యేల సంగతి సరేసరి. జగన్ అపాయింట్ మెంట్ దొరకాలంటే ఎమ్మెల్యేలు రోజుల తరబడి తాడేపల్లి ప్యాలెస్ ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు జగన్ అధికారం కోల్పోయాక పరిస్థితిలో మెల్ల మెల్లగా మార్పులొస్తున్నాయి. జగన్ కోటరీ ఒక్కొక్కరే దూరం జరిగారు. అధికారంలో ఉన్నప్పుడు గొంతు చించుకున్నవారు కూడా సైలెంట్ అయ్యారు. చివరకు మిగిలింది కార్యకర్తలు, స్థానిక నాయకులే. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీకి లాయల్ గా ఉన్నవారు వైసీపీ పరువు కాపాడారు. అందుకే వారికి రేపు తాడేపల్లిలో ప్రత్యేకంగా అపాయింట్ మెంట్ ఇచ్చారు జగన్. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎంపీపీ, జడ్పీ ఉప ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవాన్ని తప్పించుకుంది. గతంలో ఆయా సీట్లన్నీ వైసీపీకి చెందినవే. అయితే వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా, వైసీపీకి కాస్త అనుకూలంగా ఫలితాలొచ్చాయి. దీంతో జగన్ కి తత్వం బోధపడింది. తాను ఇన్నాళ్లూ దూరం పెట్టిన కార్యకర్తలు, స్థానిక నేతలే తనను వదిలిపెట్టలేదని అర్థమైంది. అధికారంలో ఉన్నప్పుడు తన చుట్టూ కోటరీగా తిరిగిన వాళ్లు, రాజ్యసభ స్థానాలు, ఎమ్మెల్సీలు తీసుకున్నవారు అడ్రస్ లేకుండా పోయారనే విషయం స్పష్టమైంది. దీంతో జగన్ లో మార్పు మొదలైంది. కార్యకర్తలకు హ్యాట్సాఫ్ అంటూ ఆమధ్య ట్వీట్ వేసిన ఆయన, తాజాగా స్థానిక నాయకులతో ప్రత్యేకంగా మీటింగ్ పెట్టారు. పార్టీ విజయానికి సహకరించిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలను స్వయంగా కలుస్తానని కబురు పంపించారు జగన్. వారందర్నీ తాడేపల్లికి పిలిపిస్తున్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగే సమావేశానికి అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాలకు సంబంధించి 8 నియోజకవర్గాల్లోని వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు హాజరవుతారు. వీరందరికీ జగన్ ప్రత్యేకంగా సమయం కేటాయిస్తారట. అందరితో మాట్లాడి, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అడిగి తెలుసుకుంటారట.

### ఈ మార్పు సరిపోదు జగనూ..

జగన్ లో మార్పు మొదలవడం మంచిదే, కానీ ఈ మార్పు సరిపోదు. అప్పట్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ని పొరుగు రాష్ట్రం నేతలంటూ ఎగతాళి చేసిన జగన్.. అధికారం పోయాక తాను బెంగళూరులో ఎందుకు తలదాచుకుంటున్నారో చెప్పాల్సి ఉంది. కానీ జగన్ ఇప్పుడు అసలైన పొలిటికల్ టూరిస్ట్ లా మారిపోయారని సోషల్ మీడియాలో కౌంటర్లు పడుతున్నాయి. ఎప్పుడో ఎక్కడో రాష్ట్రంలో ఎవరైనా చనిపోతే మాత్రం పరామర్శలకు వస్తున్నారనే ఆరోపణ కూడా ఉంది. కానీ ఈసారి లోకల్ లీడర్స్ కోసం బెంగళూరు నుంచి జగన్ వస్తున్నారు. ఇది మెచ్చుకోవాల్సిన విషయమే. కానీ ఈ మార్పు సరిపోదు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన కళ్లకు గంతలు కట్టి ఆడించింది కోటరీయేనని ఆ పార్టీ నేతలు కొందరు బలంగా నమ్ముతున్నారు. ఆ గంతలు ఆయన విప్పుకోవాలి. ప్రజల మధ్యకు వచ్చినప్పుడే ఏదైనా ఫలితం ఉంటుంది. అది కూడా కూటమి చేసే తప్పుల్ని బట్టే ప్రజలు జగన్ దగ్గరకు చేరతారనే విషయాన్ని మరింతగా అర్థం చేసుకోవాలి. పాలనలో కూటమి సక్సెస్ అయితే నాలుగేళ్ల తర్వాత కూడా ప్రజలకు జగన్ అవసరం ఉండదు.

# బొత్సపై జనసేన ప్రత్యేక దృష్టి



విజయవాడ : ఏపీలో ( రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలని కూటమి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే ఆ పార్టీకి కీలక నేతలు గుడ్ బై చెబుతూ వచ్చారు. పార్టీలో నెంబర్ 2 స్థాయి కలిగిన నేతలు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడారు. గత ఐదేళ్లపాటు పదవులతో పాటు ఆ పార్టీలో గౌరవం పొందిన నేతలు సైతం ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఇప్పటికే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వరుసగా పార్టీకి రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యులతో పాటు ఎమ్మెల్సీలు సైతం పదవులను వదులుకున్నారు. విజయసాయిరెడ్డి లాంటి నేత వైసిపికి గుడ్ బై చెప్పడం ఆందోళన కలిగించే అంశమే. అయితే ఇప్పుడు తాజాగా బొత్స సత్యనారాయణ పై సైతం అనుమానపు చూపులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. వాస్తవానికి బొత్స సత్యనారాయణ పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. అందుకు అనుగుణంగా బొత్స పవన్ కళ్యాణ్ ను ఎక్కడ కలిసిన ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు భిన్నంగా బొత్స వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణాల్లో ఎదురుపడినప్పుడు ఆప్యాయ పలకరింతలు, ఆలింగనాలు చేసుకుంటున్నారు. దీంతో ఏదో జరుగుతోందన్న అనుమానాలు ఉన్నాయి. అయితే తాజాగా పవన్ కళ్యాణ్ సైతం బొత్స విషయంలో పార్టీ శ్రేణులకు చర్చలు జరిపినట్లు ప్రచారం సాగుతోంది. బొత్సను పార్టీలోకి తెస్తే ఎలా ఉంటుంది అని పార్టీ శ్రేణుల అభిప్రాయాన్ని సేకరించినట్లు సమాచారం. అయితే జనసేన నాయకుల నుంచి సానుకూలత రావడంతో పవన్ నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై అనేక కేసులు నమోదవుతున్నాయి. కొందరు అరెస్టులు కూడా అయ్యారు. కానీ బొత్స విషయంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఆయనకు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడడం లేదు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు మంత్రిగా పనిచేశారు బొత్స. కానీ ఎన్నడు రివేంజ్ రాజకీయాలు నడపలేదన్నది ఆయనపై ఉన్న మంచి ముద్ర. అందుకే కూటమి ప్రభుత్వంలో సైతం ఆయనకు సరైన గౌరవం దక్కుతోంది. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ శాసనమండలిపక్ష నేతగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. పార్టీ తరపున గట్టి వాయిస్ వినిపిస్తున్నారు. అటువంటి నేతను జనసేనలోకి తెచ్చుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దెబ్బతీయవచ్చని పవన్ భావిస్తున్నారట. ఉత్తరాంధ్రలో పట్టున్న నాయకుడు బొత్స. విజయనగరం జిల్లాలో అయితే నాలుగు నియోజకవర్గాలు ఆయన కుటుంబ సభ్యుల చేతిలో ఉంటాయి. మిగతా నియోజకవర్గంలో సైతం ప్రభావం చూపగలరు. ఉత్తరాంధ్రలో బలమైన తూర్పు కాపు సామాజిక వర్గంలో పట్టున్న నేత. అందుకే ఆయనను జనసేనలోకి రప్పించుకుంటే పార్టీ బలోపేతం అవుతుందని పవన్ భావిస్తున్నారట. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# దువ్వాడ సినిమాల్లోకి రానున్నారా?

శ్రీకాకుళం : దువ్వాడ శ్రీనివాస్-మాధురి.. ఏ తెలుగు న్యూస్ ఛానెల్ చూసినా, యూట్యూబ్ ఛానెల్ చూసినా వీరిద్దరి సందడి అంతా ఇంతా కాదు. మాధురి ఎపిసోడ్ కి టాప్ రేటింగ్స్ రావడంతో అప్పట్నుంచి ఆమెను మీడియా నీడలా అనుసరిస్తోంది. మాధురిని ఆకాశానికెత్తేయడం, ఆమెను హీరోయిన్ లా ఉన్నారని అనడం, అందులోనూ నగ్మాతో పోల్చడం.. ఆమెతో క్యాట్ వాక్ చేయించడం, పాటలు పాడించడం, డ్యాన్స్ చేయించడం.. అబ్బో ఇలాంటి సీన్స్ ఇంటర్వ్యూల్లో చాలానే ఉన్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సినిమా ఎంట్రీ విషయంపై మరోసారి క్లారిటీ ఇచ్చారు మాధురి. మాధురికి చాలా క్వాలిఫికేషన్లు ఉన్నాయని పొలిటీషియన్, వుమన్ ఎంటర్‌ప్రెన్యూర్, ఇన్ ఫ్లూయెన్సర్, ఫైర్ బ్రాండ్.. ఇలా చాలా ఉన్నాయని, సినిమా హీరోయిన్ కూడా అందులో యాడ్ అవుతోందని యాంకర్ ఆమెను పొగడ్తల్లో ముంచెత్తారు. మాధురి కూడా తనకు చిన్నప్పటినుంచి యాక్టింగ్ అంటే ఆసక్తి ఉందని చెప్పుకొచ్చారు. అంతే కాదు, గతంలో తనకు టైమ్ దొరకలేదని, ఛాన్స్ దొరకలేదని.. టైమ్ వచ్చినప్పుడు అది కూడా జరుగుతుందని చెప్పుకొచ్చారు మాధురి. మాధురి తనకు సినిమాల్లోకి వెళ్లాలనుంది అని అనగానే, పక్కనే ఉన్న దువ్వాడ శ్రీనివాస్ ఊరుకుంటారా..? ఆయన కూడా మాధురి టాలెంట్ ని బయటపెట్టారు. పాటలు పాడటం కంటే కంటే ఆమె డ్యాన్స్ బాగా చేస్తుందని చెప్పుకొచ్చారు. భరతనాట్యంలో ఆమెకు ప్రవేశం ఉందన్నారు. నెమలికి నేర్పిన నడకలివీ అనే పాటతోపాటు, చాలా పాటలకు ఆమె అద్భుతమైన పర్ఫామెన్స్ ఇస్తుందన్నారు. గతంలో దువ్వాడ కూడా మాధురిని అడిగి మరీ కొన్ని పాటలకు డ్యాన్స్ వేయించుకునేవారట. దువ్వాడ శ్రీనివాస్ తనకు సీనియర్ ఎన్టీఆర్ అంటే ఇష్టమని, ఆయనే తనకు రోల్ మోడల్ అని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ ఆయన సినిమాల్ని తాను చూస్తుంటానని, హోమ్ థియేటర్లో ఆయన సినిమాలు చూస్తానన్నారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు తాను థియేటర్లకు వెళ్తుంటానన్నారు. జూనియర్ ఎన్టీఆర్ ని కూడా తాను అభిమానిస్తానని, అయితే తాను సీనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్ అని చెప్పుకొచ్చారు దువ్వాడ. కార్ లో సీనియర్ ఎన్టీఆర్ పాటలు పెట్టుకుంటారని, అప్పుడప్పుడు ఆ పాటలకు అర్థాలు తనకు చెబుతుంటారని కోరస్ ఇచ్చారు మాధురి. శ్రీనివాస్ కి కూడా సినిమాలంటే బాగా ఇష్టం. ఆమధ్య మాధురి నిర్మాతగా ఆయన ఒక షార్ట్ ఫిల్మ్ లో కూడా నటించినట్టు వార్తలొచ్చాయి. నటించిన వీడియోలు కూడా బయటకొచ్చాయి. ఇక మాధురి కూడా తన యాక్టింగ్ పెర్ఫామెన్స్ ని వెండితెరపై చూపించాలనుకుంటున్నారు. ఫైనల్ గా వీరిద్దరూ హీరో హీరోయిన్లుగా నటించే అవకాశం ఉందేమోనని అనిపిస్తోంది. దువ్వాడ-మాధురి కాంబినేషన్ ఇప్పటికే బుల్లితెరపై, యూట్యూబ్ లో సూపర్ హిట్ అయింది. వీరి ప్రోగ్రామ్ లకు మంచి ప్రేక్షకాదరణ ఉంది. ఇక వీరు సినీరంగంలోకి వెళ్తే జనాల రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి. షార్ట్ ఫిల్మ్ ల వరకు ఓకే, వెండితెరపై కనపడాలంటే అది కాస్త ఖర్చుతో కూడుకున్న పని, దానికి దువ్వాడ సిద్ధపడతారా..? మాధురి తెరంగేట్రానికి తానే నిర్మాత అవుతారా..? వేచి చూడాలి.



Edited,Printed,Published and Owned by **PALLA KONDALA RAO**, H.No:5-13/1,Allapadu Road,Bonakal(Village,Post & Mandal),Khammam District-507204, Telangana State.
Printed at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah nagar, Gurralapadu (V), Tallampadu (Post), Khammam(Rural) Mandal, Khammam District, Pin-507170, Telangana State.
Published at H.No:11-3-17/1, Beside Ankura Hospital,Balaji Nagar, Khammam-507002, Telangana State, **EDITOR : PALLA KONDALA RAO** **RNI. No. TELTEL/2017/74161**